ప్రజాశక్తి

Vol. 3, no. 17

(Oct. 27, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 17

(Oct. 27, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 17

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 27-10-43

నవంబరు 1 నుండి 7 వరకు జాతీయైక్యతావారం జరపండి

కమ్యూనిస్టుపార్టీని బలపర్చండి : : : : దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించండి

భారతదేశ కమ్యూనిస్టుపార్టీ గత 20 సంవత్సరాలుగా దేశ స్వాతంత్ర్యంకోసం పని చేస్తూంది. 1929 లో మీరటుకుట్రకేసు లోనూ, తిరిగి 1940 లోనూ, కమ్యూనిస్టు నాయకులను అరెస్టుచేసి జైళ్ళలో పెట్టింది ప్రభుత్వం. నేటికీ 700 మంది కమ్యూనిస్టులు జైళ్ళలో మ్రగ్గుతున్నారు. నల్గురు కయ్యూరు కామ్రేడ్సు ఉరితీయబడ్డారు. ప్రభుత్వనిర్బంధాన్ని లెక్కచేయకుండా దేశస్వాతంత్ర్యంకోసం కమ్యూనిస్టుపార్టీ కార్మికులను కట్టుబాటుచేస్తూ, కార్మిక సంఘాలు ఏర్పరచింది. వ్యవసాయకూలీ సంఘాలు రైతుసంఘాలు, యువజన సంఘాలు, స్త్రీ సంఘాలు ఏర్పాటు చేసింది. ప్రజలు తమ రోజు రోజు కష్టాలను పోగొట్టుకోడానికి తమ తమ సంఘాలద్వారా పనిచేసుకొనేటట్లు చేసింది. ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధిపరచి, స్వాతంత్ర్య పోరాటంలోకి తీసుకవస్తూంది. కాంగ్రెసును స్వాతంత్ర్యసంస్థగా బలపరుస్తూవుంది.

రష్యాలో 25 సంవత్సరాలకు ముందే, 1917 నవంబరు ఏడవ తేదీన కమ్యూనిస్టు పార్టీ ధనికుల, జమీందారుల, రాజుల, పరిపాలన పోగొట్టి, పనిచేసే ప్రజల రాజ్యాన్ని ఏర్పరచింది. ఆ సోవియట్ రాజ్యంలో పని దొరకకబాధపడేవారులేరు. అందరూచదువుకోగలిగారు. రోజుకు 7 గంటల పని. ఐదు రోజులు పనిచేస్తే ఆరవ రోజు సెలవు. సంవత్సరానికి నెలరోజులు నిండు జీతంతో సెలవులు. ప్రతివ్యక్తికీ సగటున నెలసరిఆదాయం 300మొదలు 400రూపాయిలు. వైద్యసహాయం ఉచితం. ముసలివారికి పెన్షన్లు. స్త్రీలు చదువుకొని, పురుషులతోపాటు సమానంగా అన్ని పనులు చేయగల్గుతున్నారు; పురుషులతోపాటు సమానగౌరవ ప్రతిపత్తులు పొందారు. ప్రసవించేముందు, పిదప 6 వారాలు నిండు జీతంతో సెలవులు. తల్లులు పనిచేస్తూ ఉంటే పసిపాపలను చక్కని భవనాలలో దాదులు లాలించి పోషించుతారు. మూడేండ్లు మొదలు 14 యేండ్లవరకు బిడ్డలకు ప్రభుత్వం ఉచితంగా తప్పనిసరిగా, చదువు చెప్పిస్తుంది.

అట్టి సోవియటు ప్రజారాజ్యంపై జర్మను నాజీ రాక్షససైన్యం 1941 జూన్ నెలలో విరుచుకుపడింది. సోవియటు రాజ్యమనే అడ్డు కట్టను బ్రద్దలుకొట్టి నాజీసేనలు, అమెరికాపైకి, చైనా ప్రజారాజ్యంపైకి, మనదేశం మీదికికూడ రావాలనుకున్నాయి. మరోవైపు నుండి చైనాకు ఇక సోవియటురష్యా సాయం చేయలేదని, అందుచే తనకు ఏమీ భయం లేదని,జపాను తన బలాన్ని దక్షిణంగామరల్చి ప్రపంచ యుద్ధంలో దిగింది. ఫిలిప్పైను, తూర్పు ఇండియా దీవులు, మలయా, బర్మాలను,ఆక్రమించుకొని మనదేశ సరిహద్దులపైకి వచ్చింది. చిట్టగాంగు, కలకత్తా, అస్సాములపైనా, విశాఖపట్టణం, కాకినాడ, మద్రాసులపైనా బాంబులువేసి మన ప్రజలను హత్యగావించసాగింది.

ప్రపంచ ప్రజలంతా, తమ దేశమును ఆక్రమించుకోడానికి వస్తూవున్న జపాను, జర్మనీ, ఫాసిస్టు సైన్యాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యంకోసం నిలబడిపోరాడుతున్నారు. ప్రపంచమంతా యుద్ధభూమి అయిపోయింది. ఒకవైపు సోవియటు యూనియను, చైనా, యూరపు ప్రజలు, ఇంగ్లండు, అమెరికాలు; మరోవైపు ఫాసిస్టు రాజ్యాలైన జర్మనీ, జపానులు. వీరిలో ఎవరి విజయాన్ని దేశభక్తుడు కోరుతాడు? 60 సంవత్సరాలుగ మన స్వాతంత్ర్య పోరాటాన్ని నడుపుతూ వచ్చిన మన కాంగ్రెసుసంస్థ మన అందరి తరఫున ఇదివరకే జవాబుచెప్పింది. సోవియటు, చైనాలున్న పక్షమే గెలవాలనీ, ఆ పక్షంతోచేరి జపానును ఢీకొనాలని చెప్పింది. 5 ఏండ్లక్రితమే చైనాకు డాక్టర్లను (మెడికలు దళాన్ని ఒకదానిని) పంపిందికూడా. ప్రపంచ ప్రజలంతా ఫాసిస్టురాజ్యాలకు వ్యతిరేకంగా యుద్ధం చేసేటప్పుడు, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్య యుద్ధానికి వ్యతిరేకంగా పని చేయడం మన స్వాతంత్ర్యానికి దారికాదు.

కమ్యూనిస్టుపార్టీ దీనిని గుర్తించి ది. బ్రిటీషు సామ్రాజ్యవాదంతో బేరాలాడితే వారు స్వరాజ్య మివ్వరు. మన ప్రజా బలాన్ని, ఐక్యతను, పెంపొందించుకుంటేనే మనం స్వాతంత్ర్యం సంపాదించుకోగల్గుతాం. నేటి పరిస్థితులలో యుద్ధంలోపాల్గొనడంవల్లనే మన ప్రజలశక్తిని పెంపొందించగల్గుతాం. ప్రపంచ ప్రజల సానుభూతిని, సహకారాన్ని, పొందగల్గుతాం. జపాను ఫాసిస్టుమూకలను దేశ సరిహద్దులనుండి పారద్రోలగల్గుతాం. బ్రిటిషు సామ్రాజ్యవాదుల బానిసత్వాన్నుండి బయట పడగలుగుతాం.

జపానుతో ఢీ కొనడానికి, దేశరక్షణకు కావలసిన ప్రభుత్వాన్ని బ్రిటిషు ప్రభుత్వం ఇవ్వకుంటే, దానిని సంపాదించడానికి పోరాటము ప్రారంభిస్తామని కాంగ్రెసు అన్నది. దీనిని సాకుగా తీసుకొని నాయకులనందరిని ప్రభుత్వం అరెస్టు చేసింది. ప్రజలు, దేశభక్తులు, కోపంతో, కాంగ్రెసు ఆశయమయిన జపాను వ్యతిరేక యుద్ధకృషికే భంగం కలిగేటట్లు విధ్వంసక చర్యలు సాగించారు. కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకు, వారిననుసరించే ఇతర ముఠాలు, దేశంలో అరాజకత్వం వ్యాపింపజేయడానికి చూస్తున్నాయి. దేశంలోనిప్రజాసంస్థలన్నిటినీ విచ్ఛిన్నంచేయడానికి; ప్రజాఐక్యత, జాతీయైక్యత, రాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అరాజకత్వం ఎక్కువై జపానువస్తే స్వాతంత్ర్యం వస్తుందనే దేశద్రోహక ప్రచారం చేస్తున్నాయి. జపానువస్తే మనకు వచ్చేది జపాను క్రింద బానిసత్వం కాని, స్వాతంత్ర్యంకాదు.

కమ్యూనిస్టు కార్యక్రమం ఏమిటి?

1. జపాను ఫాసిస్టు మూకనుండి మన దేశాన్ని రక్షించుకోడానికి, బ్రిటిషుసామ్రాజ్య వాదుల బానిసత్వంనుండి బయటపడడానికి, జాతీయ ప్రభుత్వం సంపాదించుకోవాలి. కాంగ్రెసు - లీగు ఐక్యతపై రాష్ట్రాలలోను, కేంద్రంలోదేశాని కంతటికీ, అఖిలపక్ష ప్రభుత్వాలను ఏర్పరచడమే జాతీయప్రభుత్వం.

2. జాతీయ ప్రభుత్వం కాంగ్రెసు - లీగు ఐక్యతను సాధిస్తేనే ఏర్పరచుకోగల్గుతాం. ముస్లిం లీగును బ్రిటిషు ప్రభుత్వ ఏజెంటు సంస్థఅని నిందిస్తే స్వాతంత్ర్యంరాదు. ముస్లిం లీగు పదికోట్లమంది భారతీయ ముస్లిం ప్రజా సామాన్యపు కోర్కెలను ప్రతిధ్వనించే దేశభక్తిపూరిత రాజకీయ సంస్థ. సరిహద్దు రాష్ట్రంలోని పఠానులకు, పశ్చిమ పంజాబులోని పంజాబీ ముస్లింలకు, సింధు దేశీయులకు, బెలూచీలకు, కాశ్మీర దేశీయులకు, తూర్పు, ఉత్తర బెంగాలులోని ముస్లింలకు, స్వయం నిర్ణయాధికారాన్ని కోరుతూ ఉంది. భారత ప్రజలంతా ఏ విధంగా స్వరాజ్యం కావాలని ఆవేదన పడుతున్నారో, అదేరీతి ఈ ముస్లిం జాతులుకూడ తమ రాజ్యాంగ విధానాన్ని తామే నిర్ణయించుకొనే హక్కుండాలంటున్నారు. దీనిని కాంగ్రెసు, దేశ ప్రజలు, అంగీకరించాలి; ముస్లిం సోదరుల లోని అనుమానాలను పోగొట్టాలి. అప్పుడే కాంగ్రెసు - లీగు రెండూ భుజం భుజం కలిపి దేశ స్వాతంత్ర్యంకోసం పనిచేయగల్గుతాయి. ఆ స్వాతంత్ర్య పోరాటంలో వచ్చే ఐక్యతతో ముందుముందు ముస్లింజాతులు విడిపోకుండా, భారత ఐక్య రాజ్యాంగాన్ని ఏర్పరచగల్గుతాం.

3. దేశ సరిహద్దులలో జపాను పొంచి కూర్చొనివుంది. యుద్ధం మనదేశ సరిహద్దులకు రాగానే మన ప్రజలకు కావలసిన తిండి, బట్ట, కరువైపోయింది. కొంతమంది నిల్వ వ్యాపారస్తులు లాభాలకు, పండిన పంటనంతా కొని దాచేస్తున్నారు. బెంగాలులో తినడానికి తిండిలేక వేలకొలది చనిపోతున్నారు. ప్రతి నిమిషానికి ఒక్కడైనా చనిపోతున్నాడంటే అతిశయోక్తికాదు. రాయలసీమ, మలబారు, ప్రజలుకూడ ఆకలికి అల్లాడుతున్నారు. మన ప్రజలకు తిండిపెట్టి రక్షించుకోడం మన కర్తవ్యం. అదే దేశసేవ. అదే ఉజ్వల దేశభక్తి. రైతులం వేలకొలది సంవత్సరాలుగా పంటను పండించి ప్రజలను పోషించేవారం. నేడు మన కర్తవ్యాన్ని మరచిపోతామా? అన్నదాత రైతు అనే గౌరవాన్ని పోగొట్టుకుంటామా? రైతు పేరుకు, మన పూర్వుల పేరుకు కళంకంతెస్తామా? ముమ్మాటికీ తేము.

ఎక్కువ పంటలను పండిస్తాం. ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా, వానిని లక్ష్యం చేయక ప్రజలకు కావలసిన తిండిని పండిస్తాం. పండించిన తిండిని మధ్య నిల్వవర్తకుల చేతులలోకి పోకుండా, కంట్రోలు ధరలకు ప్రభుత్వానికే అమ్ముతాం. లాభాలకని, ఎక్కువ ధరలకోరి, ప్రతి నిమిషం మన సోదర దేశీయుని హత్యకు మనం బాధ్యులం ఎప్పటికీకాము.

మనకు కావలసిన గుడ్డ, మన కార్మిక సోదరులు, తమ ఆదివారం సెలవుకూడ వదలుకొని తయారుచేస్తున్నారు. అట్లే మనకు కావలసిన ఇతరవస్తువులన్నీ కూడా కార్మిక సోదరులు నడుముకట్టి ఎక్కువ తయారు చేయడానికి పూనుకుంటున్నారు.

4. మనదేశ సరిహద్దులనురక్షించడానికి, జపాను శత్రువును పారద్రోలడానికి, దేశ స్వాతంత్ర్యంకోసం మన రైతులనుండి, మన కార్మికులనుండి 20 లక్షలమంది సైన్యంలో చేరి పోరాడుతున్నారు. ఈరోజు ఈసైన్యం మనపై దౌర్జన్యంచేయడానికికాదు ఏర్పడింది. మనలను జపాను శత్రుబారినుండి రక్షించడానికి. మునుపటివలె ప్రజలకు దూరంగా వీరిని బారక్కులలో ఉంచడంలేదు. ప్రజలతో కలసి, ప్రజల సహకారంమీద ఆధారపడి, వుండకతప్పదు. ప్రజలకు సైన్యానికీ ఎడబాటు కల్గించాలనే సామ్రాజ్యవాదపు ఎత్తు ఈరోజు సాగదు. మన సైనికులకోసం కావలసిన తిండిని, గుడ్డను, ఆయుధాలను, తయారు చేయడం - ఎక్కువగా తయారుచేయడం మనపైవుంది. వారి కుటుంబాలకు కావలసిన సహాయం, సానుభూతి మనం చూపాలి, మన సైనికులను, దేశరక్షణజేస్తున్నందులకు తగు సన్మానాలిచ్చి, ప్రోత్సాహపరచాలి. అలా చేస్తూ సైన్యాన్ని ప్రజా సైన్యంగా, జపాను వ్యతిరేక స్వతంత్ర సేనగా, చేయగల్గుతాం.

5. మన ప్రజలను అరాజకాన్నుండి రక్షించుకోడానికి, కరువు కాటకాలనుండి రక్షించుకోడానికి, అంటువ్యాధులు, అగ్ని ప్రమాదాలు, విమానదాడులనుండి రక్షించుకోడానికి, మన గ్రామ రక్షణకు, మన స్త్రీలను, బిడ్డలను, ఇండ్లను రక్షించుకోడానికి, ప్రతి గ్రామంలో ప్రజారక్షణ దళాలను ఏర్పరచుకుంటాం.

6. మన ప్రజలలో నిరుత్సాహాన్ని, నిరాశను పోగొట్టి, కరువుకాటకాలనుండి, ఈతి బాధలనుండి, జపాను శత్రు ప్రమాదాలనుండి బయటపడడానికి,మనదేశ ప్రజలందరినీకలిపి, నడపగల మననాయకులను విడుదలచేయించుకోవాలి. దానికి నిరంతర కృషి, ఆందోళన చేస్తాం.

ప్రజా ఐక్యత, ప్రజాసంఘటన, పెంపొందించుకొంటూ, మనం మన నాయకులను విడిపించుకోగల్గుతాము. కాంగ్రెసు — లీగు ఐక్యతను, జాతీయ ప్రభుత్వాన్ని సాధించగల్గుతాం. జపాను శత్రువును, బ్రిటిషు బానిసత్వాన్ని, పారద్రోలగల్గుతాం. సోవియటు విజయాలు, యూరపు ప్రజల, చైనా ప్రజల గెరిల్లా విజయాలు, మన శత్రువులను నాశనం కావించడానికి తోడ్పడుతాయి. మనం నిరాశ పడవలసిన అవసరమేమీలేదు.

అందరూ రైతు, వ్యవసాయ కూలీ, స్త్రీ, యువజన సంఘాలలో చేరండి. రైతు-కూలీ సామరస్యాన్ని, గ్రామ ప్రజా ఐక్యతను సాధించండి.

ఈ కార్యక్రమంతో పనిచేస్తూన్న కమ్యూనిస్టుపార్టీని బలపర్చండి! కమ్యూనిస్టుపార్టీ పత్రిక "ప్రజాశక్తిని" చదవండి! కమ్యూనిస్టు పార్టీ ఫండుకు విరాళాలివ్వండి!

—ఆంధ్రరాష్ట్రకమిటీ, భారతకమ్యూనిస్టుపార్టీ

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సర చందా	5—0—0
అర్థ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

సవరణ

★

నవంబరు 1 నుండి 7 వరకు జరిగే జాతీయైక్యతావారంలో, 'కాంగ్రెసు నాయకులను, ఇతర ఫాసిస్టువ్యతిరేక రాజకీయఖైదీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రతి గ్రామమునుంచి సంతకాలు చేసి మద్రాసు ప్రభుత్వానికి పంపుటకు అచ్చువేసిన విజ్ఞప్తి పత్రంలో, మూడో పేరా, రెండవలైనులో మహీధరరామమోహనరావు అనుటకు బదులు పొరపాటున జగన్మోహనరావు అని అచ్చుపడింది. అందుచేత విజ్ఞప్తిపై సంతకాలు చేయించేవారు దానిని రామమోహనరావు అని సవరించి మరీ సంతకాలు చేయించి ప్రభుత్వానికి పంపాలని కోరుతున్నాను.

చండ్ర రాజేశ్వరరావు,

కార్యదర్శి, రాష్ట్రకమిటీ, భారతకమ్యూనిస్టుపార్టీ.

బుధవారం **ప్రజాశక్తి** 27-10-43

రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

దేశంలో నలుమూలలా ఆకలిమంటలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా జపాన్‌శత్రువు సరిహద్దున వేచివున్న బెంగాల్‌లో వారానికి 10 వేల మందికిపైగా అన్నాతురులైన ప్రజలు మరణించుతున్నారని ఆంగ్లో యిండియన్ పత్రిక "స్టేట్స్‌మన్" అంచనా వేసింది. బర్మాను జపాన్ దుండగీడులనుండి విముక్తిచేయడానికి పసిఫిక్ సేనానాయకుడు లార్డు మౌంట్‌బాటన్ సన్నాహాలు చేస్తున్నాడని ప్రభుత్వ ప్రకటనలే తెలుపుతున్నాయి.

బర్మాపై దండయాత్రకు భారతదేశం కీలకస్థానమనే విషయం అందరికీ తెలిసిన విషయమే. ఈ సమయంలో మిత్రమండలి సైన్యాలకు భారతప్రజల సహకారం అవసరమనే విషయంకూడా అందరూ అంగీకరించే సత్యం. అదేవిధంగా దేశంలో వ్యాపించిన ఆహారసంక్షోభాన్ని తొలగించడానికికూడ ప్రజలందరి సహకారం అవసరం. ఈ ప్రజాసహకారం సంపాదించడానికి భారతప్రజలను దేశభక్తియుతమైన కర్తవ్యానికి ఉత్తేజపరచాలి.

ఇందుకొరకు జైలులో నిర్బంధించబడిన జాతీయనాయకులందరిని ప్రభుత్వం విడుదలచేయాలి. కాంగ్రెస్ నాయకత్వం బొంబాయి తీర్మానంద్వారా తాము మిత్రమండలి విజయాన్ని కోరుతున్నామనీ, యుద్ధకృషిని జయప్రదంగా నెరవేర్చడానికే జాతీయప్రభుత్వం యివ్వాలనీ కోరింది. ఈ విషయాన్నే గాంధీజీ వైస్రాయికి వ్రాసిన లేఖలలో మరల స్పష్టపరచాడు. అంతేగాక తనను విడుదలచేస్తే ఆహార కరువును పరిష్కరించడానికి కృషిచేస్తానని తెలియజేశాడు. ఇంత స్పష్టంగా గాంధీజీ తెలియజేశాక కూడ ప్రభుత్వం జాతీయనాయకులను యింకా జైలులో ఉంచడం మూర్ఖత్వమే అనిపించుకుంటుంది గాని, రాజనీతి ఏమాత్రంకాదు. పైగా అది మిత్రరాజ్యాల ప్రజల క్షేమానికి, యుద్ధ నిర్వహణకు కూడా వ్యతిరేకం.

ఈ విషయాన్నే బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ప్రకటన హెచ్చరించుతూంది. "ప్రభుత్వం భారతప్రజల సంపూర్ణ సహకారాన్ని సంపాదించడానికి ఫాసిస్టు వ్యతిరేక ఖైదీలందరిని విడుదలచేసి, జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలి" అని కోరింది. బ్రిటీషు ట్రేడ్‌యూనియన్ మహాసభకూడ పైవిధంగానే ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. చైనా, అమెరికన్ ప్రజలు — వేయేల మిత్రరాజ్యాల ప్రజలందరూ మిత్రరాజ్యాల సత్వర విజయ సాధన కొరకే భారతదేశంలోని రాజకీయ ప్రతిష్టంభనను తొలగించాలనీ, జాతీయప్రభుత్వం స్థాపించాలని కోరుతున్నారు.

ఈ వాస్తవిక విషయాలను కొత్త వైస్రాయి వేవెల్ ప్రభువు గుర్తించి ఫాసిస్టు వ్యతిరేక ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని హెచ్చరించుతున్నాము. ఇందుకు భారతీయులు తమ విధిని నెరవేర్చాలి. జాతీయ నాయకుల్ని విడుదల చేయకపోవడం జాతీయైక్యతకు ఆటంకంగావుంది. బయటవున్న దేశభక్తులు కాంగ్రెస్—లీగ్ ఐకమత్యం నిర్మించడానికి కృషిచేయాలి. ప్రజల ఆకలిమంటలను చల్లార్చడానికి పనిచేయుటద్వారాను, ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరించుటద్వారాను జాతీయైక్యత నిర్మించడం సులభసాధ్యమవుతుంది. మిత్రరాజ్యాల ప్రజల ఒత్తిడికి సహాయంగా భారతప్రజలు ఐకమత్యంతో కృషిచేస్తే బ్రిటీషు ప్రభుత్వాన్ని వంచగల్గుతాము. జాతీయ నాయకులను విడుదల చేయించుకొని, జాతీయ ప్రభుత్వాన్ని సాధించ గల్గుతాము.

1940 లోనే అరెస్టుచేయబడి జైళ్ళలో అప్పటినుంచి డిటెయిన్ చేయబడిన కమ్యూనిస్టు ఖైదీలను యింకా కొంతమందిని మద్రాస్ ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇంకా జైలులోవున్న కామ్రేడ్స్ ఘాటే, కొసరాజు శేషయ్య, అల్లూరి సత్యనారాయణ, మహీధర రామమోహన్, నంబూరు శ్రీనివాసరావుగార్లు ఫాసిస్టు వ్యతిరేకులనే విషయం ప్రజలకు, ప్రభుత్వానికి తెలిసినదే. ఆ కామ్రేడ్స్ యుద్ధంలో మిత్రరాజ్యాల విజయంకోసం, జపాను దుండగీడులనుండి మాతృదేశాన్ని రక్షించడానికి సర్వశక్తుల ధారపోస్తారనే సంగతికూడా లోకవిదితం. ఆ కామ్రేడ్స్ తమ ప్రజలమధ్య నిలబడి ఆకలిమంటలనుండి వారిని రక్షించడానికీ, ప్రజలను ఉత్సాహపరచి దేశరక్షణను బలపరచడానికి కృషిచేయడం తమకర్తవ్యంగా ఎంచుతున్నారు.

కాని మద్రాస్ప్రభుత్వం యీ కామ్రేడ్స్‌కు అట్టి అవకాశం యివ్వక ఆలోచనారహితమైన నిర్బంధవిధానాన్ని కొనసాగించుతూంది. ఇప్పటికైనా ప్రభుత్వం యీ అపసవ్యపద్ధతిని మాని యీ కామ్రేడ్స్ నందరిని వెంటనే విడుదలచేయాలని కోరుతున్నాము. ఆగస్టు సంఘటనలకు పూర్వమే నిర్బంధించబడి 3 సంవత్సరాలకు పైగా జైళ్ళలో మ్రగ్గుతున్న యీ ప్రజాసేవకులను విడుదలచేయడానికి ఆందోళన చేయాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

★ మన రాజకీయాలు

అమేరీ పాలసీపై సమ్మెట దెబ్బలు

— కంభంపాటి సత్యనారాయణ

బెంగాల్ కరువుదృశ్యాలు రోజూ బ్రిటిష్ ప్రజల కళ్ళ యెదుట నాట్యం చేస్తున్నాయి. లిన్‌లిత్గో పరిపాలన యెంత దారుణ పరిస్థితులకు దారితీసిందో, బ్రిటిష్ ప్రజలు గ్రహించారు. లిన్‌లిత్గో పాలసీవల్ల జపాన్ వ్యతిరేక పోరాటం యెంత బలహీనమవుతూందో గుర్తించి, ఆపాలసీపై బలమైన సమ్మెట దెబ్బలు కొడుతున్నారు.

పార్లమెంటు సభ్యుడయిన క్లెమెన్స్ డేవిస్ ఇండియాకు తక్షణమే ఆహారపదార్థాలను విరివిగా పంపవలసియుంటుందనీ, వాటిని ప్రజలకు అందజేయడంలో అధికారవర్గం ప్రజల, ప్రజానాయకుల, పూర్తి సహకారం తీసుకోవడం అవసరమనీ ప్రకటించారు. వివిధ బ్రిటిష్ కార్మికసంస్థల తరఫున, కో-ఆపరేటివ్ సొసైటీల తరఫున, కొందరు స్త్రీ పురుషులు సుమారు 60 మంది పార్లమెంటు సభ్యుల్ని కలుసుకొని, బెంగాల్‌కు వెంటనే ఆహార పదార్థాలు, మందులు పంపేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడితేవలసిందనీ, జాతీయ నాయకుల విడుదలకై కృషిచేయవలసిందనీ విజ్ఞప్తి చేశారు. 40 వేలమంది లండన్ ఓడ కార్మికుల నాయకులు (స్టీవర్డ్స్) ఇండియాఅండర్ సెక్రటరీవద్దకు రాయబారం వెళ్ళి, వెంటనే ఓడలపై ఆహారపదార్థాలను పంపే ఏర్పాటు చేయవలసిందని హెచ్చరించారు. ఇలాగే బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ఆహారసమస్యాపరిష్కారానికి ప్రభుత్వం తక్షణచర్య గైకొనాలనీ, జాతీయనాయకు లందరినీ విడుదలచేసి జాతీయప్రభుత్వ నిర్మాణానికి సాగిరావాలనీ, హెచ్చరించింది. బ్రిటిష్‌ప్రభుత్వం జాతీయ నాయకులతో సంప్రతింపులు జరపాలని కోరుతూ 8 లక్షలమంది తరఫున ఆస్ట్రేలియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గం తీర్మానించింది.

బెంగాల్‌లో కరువుకు కారణం బెంగాల్ మంత్రివర్గమేనని అమెరీ చెప్పిన కల్లిబొల్లి మాటలను ఎవరూ నమ్మడంలేదు.

పార్లమెంటులో అమెరీ

మొన్న 21 వ తేదీని జరిగిన పార్లమెంటు సమావేశంలో బెంగాల్ కరువును గురించి అమెరీమీద ప్రశ్నల వర్షం కురిసింది. అమెరీని తొలగించి వేయాలనే ఒత్తిడికూడా ఆనాటి పార్లమెంటు సమావేశంలో స్పష్టమైంది. అమెరీ నియోజక వర్గంలో ఉన్న శ్రీబ్రిడ్జివర్క్స్ ఫ్యాక్టరీ కమిటీ అమెరీని తొలగించాలనీ, జాతీయనాయకుల్ని విడుదల చేయాలనీ, కొంతకాలం క్రిత మొక తీర్మానంచేసి ప్రభుత్వానికి పంపించింది. దానికి జవాబెందుకు ఇవ్వలేదని పార్లమెంటులో గలాచర్ (కమ్యూనిస్టు) చర్చిల్ ప్రధానిని అడిగాడు. దీనికి జవాబుగా చర్చిల్ శ్రీబ్రిడ్జివర్క్స్ ఫ్యాక్టరీ కమిటీ వ్యవహారాలకు యీ విషయం సంబంధించదని తెలిపాడు. వెంటనే గలాచర్ యిలా ప్రశ్నించాడు: "ఆఫ్యాక్టరీ కమిటీపట్ల బ్రిటిషు ప్రధాని కన్పరుస్తూన్న హేయభావం ఏమాత్రమూ అభినందించ దగినది కాదు. ఇండియా కార్యదర్శి (అమెరీ) నియోజక వర్గంలోనే ఉన్న మరికొందరు ఒక బహిరంగసభను జరిపిన విషయం బ్రిటిష్ ప్రధానికి తెలియదా? ఇండియా కార్యదర్శిని బయటికి పొమ్మనడంవల్ల యీ దేశమందలి అశేష ప్రజాసామాన్యపు కోర్కెనుమన్నించడమే కాదా?"

ప్రభువుల సభలో

20, 21 తేదీలలో జరిగిన ప్రభువుల సభలోకూడా భారతదేశ సమస్య ప్రాధాన్యత వహించింది. ఆహారసమస్య విషమించుటకు ప్రధాన కారణమైన ఇండియా ప్రభుత్వాన్ని ఖండిస్తూ భారతదేశ స్వాతంత్ర్యాన్ని మిత్రరాజ్యాలు గ్యారంటీచేసి, కాంగ్రెసునాయకుల్ని విడుదలచేయాలని హంటింగ్డన్ ప్రభువు ఉపన్యసించాడు. స్ట్రాబోల్గి ప్రభువు ఉద్రేకంతో యిలా మాట్లాడు:

"క్రియాశూన్య పాలసీని సమర్థిస్తూ ప్రభుత్వసభ్యుడిచ్చిన అద్భుతమైన ఉపన్యాసంవంటి ఉపన్యాసాన్ని నేనెప్పుడూవినలేదు ఇందుకునే నతన్ని అభినందిస్తున్నాను..... .... ఎప్పటికప్పుడు వాయిదాలు వేసే నిరంకుశాధికార పంథానే మళ్ళీ ప్రభుత్వం ప్రదర్శించుతోంది. ఎంతో ఆలస్యంగా పని ప్రారంభించడం; లెక్కలేనన్ని కమిటీలను నియమించడం; ముందేమి చెయ్యాలో నెలల తరబడి ఆలోచిస్తూ కూర్చోవడం; యీలోగా కరువురాక్షసి తాండవమాడడం— ఈ పాలసీ ఎంత కాలం యిలా కొనసాగుతుంది?"

కొత్తవైస్రాయి ఏంచేస్తాడు?

ఈవిధంగా బ్రిటన్‌లో ప్రజాభిప్రాయం యొక్క ఒత్తిడి నానాటికి ఎక్కువౌతోంది. అమెరీ వెనక్కు తగ్గవలసి వస్తుందా? అన్నట్లున్నాయి పరిస్థితులు. కొత్తవైస్రాయి వేవెల్ ప్రతిష్టంభనను తొలగించుటకు ఏదో ఒకటి చేస్తాడనే వార్తలు వ్యాపించుతున్నాయి. ఇందులో ఎంత యదార్థముందో తెలియదుగాని, ప్రపంచ పరిస్థితులు మనకెంతో అనుకూలంగా మాత్రం పరిణమిస్తున్నాయి. మలయా- బర్మాల పతనంతో బ్రిటిష్ ప్రజాభిప్రాయం గావించిన ఆందోళనఫలితంగా రాజీకొరకు క్రిప్స్ యెలా మనదేశం రావలసి వచ్చిందో, అలాగే యిప్పుడు కూడా సామ్రాజ్యవాదులు సంధికి రాక తప్పదు. ఒడంబడికకు సంప్రతింపులే ప్రారంభమైతే, అమెరీమురా కొక పెద్ద పరాజయం అన్నమాట. ఎందువల్లనంటే, అటు బ్రిటిష్ ప్రజాభిప్రాయంయొక్క, ఇటు భారత ప్రజాభిప్రాయం యొక్క, ఒత్తిడికి ఆగలేక, దొడ్డిదోవగుండా తప్పించుకొనుటకే లిన్‌లిత్గో గత సంవత్సరం దేశాన్ని జాతీయ సంక్షోభంలో ముంచాడను విషయం అందరికీ తెలుసు.

ప్రతిష్టంభన అంతమైతే

కాంగ్రెసు నాయకుల విడుదల చేయబడి లీగ్-కాంగ్రెసులమధ్య ఒడంబడిక కుదిరి, కేంద్రంలో జాతీయప్రభుత్వం ఏర్పడితే, పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఆహార సమస్యను (మిగతా 7వ పేజీలో)

★

ఇంటిసంగతి-?

చిన్న కథ

సెట్టి ఈశ్వరరావ్

చిత్రమైన కుటుంబం ఒకటుంది. కుటుంబం అంతటికీ వున్నది ఒక్క యిల్లు. ఆ కుటుంబం స్వాధీనంలో వుందా అంటే - అదీలేదు. ఆ యిల్లు యింకొకడి పెత్తనంలోవుంది. వాడు ఆ యింటిమీద తన యిష్టమొచ్చినట్టూ, యెన్నాళ్ళనుంచో పెత్తనం చలాయిస్తున్నాడు. ఇంటికి హక్కుదారులైన ఆ కుటుంబంలోని అన్నదమ్ముల్ని, వాడు నానా హింసలూ పెట్టేవాడు, కొట్టేవాడు, డబ్బూ యీగానీ కాజేసి యిల్లు గుల్లజేస్తున్నాడు - ఇంటి పెత్తనం చేతిలో పెట్టుకోడానికి కారణం యింకేముంది?

అయస్కాంతాని కంటే యెక్కువఆకర్షణ శక్తి వుంది డబ్బుకి. డబ్బు మహాచెడ్డది!

వాడు నీచంగా ప్రవర్తించడానికీ, వాళ్ళను ముప్పుతిప్పలు పెట్టడానికీ, కారణం డబ్బుగాక మరింకేంటి?

తండ్రులు అల్లరచిల్లరతిరుగుడుతిరిగి వాడికి అవకాశం కలిగించేరు. ఇంకేముంది?— వాళ్ళ పిలక చేతిలో లంకించుకున్నాడు.

ఇప్పుడు విచారిస్తున్నారు వాళ్ళు— చేతులు కాలేక, రక్తస్పర్శ సంతానానికి వచ్చినట్టే తండ్రులు చేసిన ప్రమాదాలు అన్నదమ్ముల గొంతుక పట్టుకున్నాయి. వాడేమో మహా పెద్దమనిషనుకొని, అమాయకంగా వాళ్ళ తండ్రులు వాడి ఖాయిదాలో పెట్టేరు యిల్లు. కొంతదగా, కొంత వెర్రిబాగులతనం, కొంత జబర్దస్తీ, యింట్లో కలతలు కొంతా యిల్లు వాడి పరమవడానికి కారణాలు.

ఇల్లా అన్నదమ్ములది, పెత్తనం చెలాయిస్తున్న వాడా, పరాయివాడు. ఆక్కడితో సరిపోయిందా?—వాళ్ళని దమాయించి నానా హింసలూ పెడుతున్నాడు. అన్నదమ్ములు యీ యాతన భరించలేక పోతున్నారు. వాళ్ళకి మొహం మొత్తింది. ఈ శని విరగడై పోతే బాగుండున్రా బాబూ అనుకున్నారు....

అందరూ కూచొని ఆలోచించేరు - బాగా ఆలోచించేరు. ఇల్లు స్వాధీనం చేసుకొని యింతకలో గంజో తాగుదామనుకున్నారు.

వాడు కాలాంతకుడు! — యిదంతా కనిపెడుతూనే వున్నాడు. అసలుకి ఎసరుపెట్టే పనికి వీళ్లు పూనుకున్నారే అనుకున్నాడు. కాని....వీళ్ళు మేకలుగదా అని నిబ్బరపడ్డాడు.

అన్నదమ్ములు ఆలోచిస్తూనే వున్నారు అహోరాత్రిలు. వీడి చేతిలోంచి బయటపడ్డం ఎలాగా అని....

"ఇల్లు మనది - వీడెవడు మధ్యని మనమీద పెత్తనం చెలాయించడానికి?" అని గుద్దురిమేడు అన్నదమ్ములలో ఒకడు.

ఇంకొకడు ప్రతిజ్ఞచేసేడు:

"మన సొత్తు మనం స్వాధీనం చేసుకొనేదాకా నిద్రయినా పోగూడదు! - యిందుకు తప్పితే -" అని ఒట్టుపెట్టబోయేడు.

"కబుర్లకేంగాని - ఇది మనం అందరం ఒకటిగా పూనుకొంటేనేగాని జరగవలసిన పనిగాదు. వాడిచేతిలోంచి యిల్లు లాక్కోవడం శాస్త్రాకూస్త్రా పనా?" కొంచం నేపూరుకొని, "కాని మనవాళ్లందరూ కలసి వస్తారనుకోను" అని శంకించేడు.

"నాసంగతి పరిష్కారం అయిందాకా నేను మీతో కలుగజేసుకోను - ఇది ముమ్మాటికి నిజం!" అంటూ వచ్చేడింకొకడు.

"ఇల్లు అర్థానమవడానికి నువ్వేకారణం!" "నిన్నింటేవాడు విర్రవిగిసిపోయి నెత్తిమీద కూచున్నాడు."

"ఈమాటలన్నిటికన్నా తనభాగం తనకు యిచ్చేస్తామని మనం ఎందుకు ఒప్పందానికి రాకూడదు?" అన్న ప్రశ్న వచ్చింది.

"నేనడుగుతున్నదీ అదే. మీతో వుండడానికి నేనిష్టపడనప్పుడు నా భాగం నాకు పంచియివ్వాలి - అంతవరకు" — తక్కిన అన్నదమ్ములతో కలవదల్చుకో లేదని స్పష్టంగా చెప్పేడు.

"సమిష్టి ఆస్తినివిడగొట్టడానికి వీల్లేదు!"

"మనం మనం కొట్లాడుకొంటూ యిల్లు వాడిపరం చేస్తున్నాం."

"అదినా తప్పుకాదు" అని అరిచేడు.

"తప్పునీది - మాదికాదు" అని గట్టిగా అరిచేరు.

అన్నదమ్ముల తగువులూ, తంటాలు వాడు జాగ్రత్తగా కనిపెడుతూనే వున్నాడు. యీవవకులంలో ముసలం పుట్టిందిరా అని సంతోషించేడు. అగ్గిమీద గుగ్గిలం వేసేడు.

అన్నదమ్ముల్లో మాటలు పెరిగేయి. మాటలు తిట్లకిందకు దిగేయి. తిట్లు కొట్లాటల వరకు వచ్చేయి. ఎడమొఖమూ, పెడమొఖమూ అయ్యేరు.

ఏది యేమైనా - ఇల్లు స్వాధీనం చేసుకోవడానికి వాళ్ళ ప్రయత్నాలు మానలేదు. ఇస్తే కాని వల్లకాదని మొలలోచెయ్యిపెట్టి వాణ్ని నిలబెట్టేరు - పెద్ద గందరగోళంచేసేరు.

"మీయిల్లు నేనేం మూటగట్టుకుంటాననుకున్నారా యేంటి? మీమంచికోసమే యిల్లు చక్కబెడుతున్నాను పోనీగదా అని - మీ సొత్తు నాకెందుకూ? మీలో మీకే యిన్ని తగవులూ తంటాలు వున్నాయిగదా— ఇల్లు మీ స్వాధీనంజేస్తే దాన్ని ధ్వంసం చేస్తారుగాని మరింకేమన్నా వుందా?" అంచేత వాళ్ళ బాగుకోసమే, వ్యవహారాలు చక్కబడేదాక తానుండి, తరువాత వాళ్ళసొత్తు వాళ్ళ కప్పజెప్పుతా నంటాడు.

ఈ యింటిసంగతి వూరూ వాడా ప్రాకిపోయింది. కొందరు ప్రత్యేకంగా తప్పు వాడిదన్నారు. కొందరు అన్నదమ్ములది తప్పన్నారు; యింకో కొందరు అన్నదమ్ముల్లో కొందరిదే తప్పన్నారు. కాని అందరూ దుర్మార్గం చేస్తున్నాడని వాణ్ని నిందించేరు. వాడుఒక్కదులిపేసేడు రేపూ మాపూ అని వాయిదాలు వేస్తున్నాడు. గోడమీదవ్రాసిన రేపు లాగ వాడిరేపుమాపులు యెంతకాలమైనా రాలేదు.

* * *

ఇది యిలాగే వుంటూండగా—

హఠాత్తుగా ఆవూరికి నిప్పంటుకొంది.

నిప్పుకు గాలి తోడైంది. మంటలు ఆకాశాన్ని అందుకొంటున్నాయి. వేడి భరించ శక్యం కాకుండావుంది. ఒక్కొక్క యిల్లూ నాశనమైపోతున్నాయి.

మన యింటిదాకా మంటలు రావులే అని అన్నదమ్ములందరూ నిబ్బరపడ్డారు—వాడూ యీ యింటికేం పరవాలేదని నిబ్బరపడ్డాడు. ఊరు కాలిపోతూనేవుంది, కోటల్లాంటి యిళ్ళు కూడా మంటల్లాపలేకపోతున్నాయి. తుపాన్లో కెరటాల్లాగ ప్రజలు గగ్గోలుపెడుతున్నారు.

అన్నదమ్ము లందరూ మఠంవేసుక్కూర్చొని, తీరుబడిగా చూస్తున్నారు. నిప్పు రవ్వలు యెగిరి వస్తున్నాయి, మంటలు మూస్తేస్తున్నాయి.

ఇంటికి నిప్పంటకండా కాపాడుకోవడమా మానడమా అన్న చర్చ వచ్చింది. చర్చ వింతగా కనిపించవచ్చు. కాని చర్చమట్టుకు సాగుతూనే వుంది.

"ఇల్లు వుంటేనేం పూడితేనేం?— మనది కానప్పుడు!"

"నావంతుసంగతి ఒప్పుకుంటేనే— లేకపోతే నేనంతకన్నా జోక్యం కలిగించుకోను!"

"ఈవేళ కాకపోతే రేపైనా మన యిల్లు మనకు రాకతప్పదు. ఇల్లు తగలబడితే నష్టం మనదా? వాడిదా?" అంది అందులో ఒక గొంతుక.

"ఏమైనాసరే—స్వాధీనం చేసేదాకా — మనకాజోక్యం వొద్దు."

"మన చిలిపితగాయిదాలు మానుకుంటే — ఇల్లు స్వాధీనం చేసుకోగలం. కాదనడం వాడి తరంకాదు. మంటలు ఇంటిదూరు వరకూ వచ్చాయి—పదండి ఆర్పుదాం!" మళ్లా వినిపించిందాగొంతుక.

తక్కినవాళ్ళు ససేమిరా అంటున్నారు....

వాడు గాబరాగా పరిగెట్టుకొచ్చేడు.

"ఎమర్రోయి యిళ్ళంటుకున్నాయ్!"

ఎవరూ మాటాళ్ళేదు.

"చూస్తూ కూర్చున్నారేంటి?—మంటలు మీ యింటిదాకా వచ్చేయి."

ఎవరూ మాటాళ్లేదు.

"లెండి - వేగం లెండి" అని కేకేసేడు.

"ఇంటిపూచీ మాకేమీలేదు," అని జవాబు.

"ఇల్లు మాదికాదుగాబట్టి—" అని యింకొకడు కలిపేడు.

"కొంపలు అంటుకుంటూంటే మొండితనమా?" అని చెయ్యిపట్టుకొని లేవనెత్తబోయేడు వాడు.

"ఇల్లు తగలబడ్డం మా కసలు ముట్టుకుయిష్టమా?" ఎంతమాత్రం యిష్టంలేదని అందరూ అన్నారు.

"కాని ముందుమాయిల్లు మాకుముట్టజెప్పు."

"ముందు మంటలు చల్లారనియ్యండి. మీ యిల్లు మీ కిచ్చేస్తాను." వాడు సమాధానపర్చబోయేడు.

"నిన్ను మేం నమ్మం. ఇప్పటిదాకా అయింది చాలదూ? స్వాధీనంచేసి మాటాడు. ఇల్లు ఇచ్చేయి — మంటలార్పడాని కిప్పుడే లేస్తాం."

"ఏయ్! నా భాగం సంగతి పరిష్కారం అయితేనేగాని నేనూరుకునేదిలేదు తెలిసిందా?"

వాడు సందిగ్ధంలో పడ్డాడు. చేతులారా యింటిని యిచ్చెయ్యడానికి మనసొప్పదు. వాళ్ళు యిస్తేనేగాని రాం పొమ్మంటున్నారు. మంటలు దాట్లువేసుకొంటూ వస్తున్నాయి. ఏమైతే అయింది - వాళ్ళు రాకపోతేపోయేరు. తనొక్కడేమంటలార్పుదామనుకొంటున్నాడు. మంటల పాలవడానికన్నా ఒప్పుకుంటాడుగాని యిల్లు చేతులారా ఒదులుకోవడాని కిష్టపడతాడా?—రుచి మరిగినవాడు!

మంటలాపరించుకొంటున్నాయి. జ్వాలలు రాక్షసుల నాలుకల్లాగ చాచుకొని యింటిని మింగడానికొస్తున్నాయి. గొంతుకలారిపోయి వేడికి గిజగిజలాడుతున్నారు. చెంపలు మాడిపోతున్నాయి....

.... ఇంత వేడినీ అన్నదమ్ములు భరిస్తూనే వున్నారు. ఇల్లు ధ్వంసం అయిపోతుందే అన్న విచారం కలగకపోలేదు. కాని వాడు!-ఇల్లుపోతేపోనీ-వాడికొంప్వణుగుతుంది!

వాడిమీద అంత క్రోధంవుంది వాళ్ళకి — ఇల్లు తగలడినా చూస్తూ వూరుకోగలంత క్రోధం!

కొంపమీదికి వస్తున్నా (మిగతా 4వ పేజీలో)

కమ్యూనిస్టుపార్టీ నిధికి సినిమానటకుల సహాయం

●

సుప్రసిద్ధ సినిమానటకుడు పృథ్వీరాజు, ఫిలిం డైరక్టరు కుర్షీద్ అన్వార్, రేడియో గాయకుడు విద్యానాథ్‌సేత్ - వీరంతా బెంగాల్ క్షామనిధికి తీవ్రంగాకృషిచేస్తున్నారు. రావల్పిండిలో (పంజాబ్) ముహరి సాహిత్య సమితివారు ఏర్పరచిన సభలో వీరంతా పాల్గొన్నారు. పృథ్వీరాజు హృదయం కరిగించే ఉపన్యాసమిచ్చాడు. మూడువేల రూపాయలు వసూలు చేయబడినాయి. సాహిత్య సమితి కార్యదర్శి నసీమ్ అన్వార్‌బేగ్, బెంగాల్ కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శికి యీ మొత్తాన్ని పంపాడు.

ఈయన వ్రాసిన ఉత్తరంలో, కమ్యూనిస్టుల తనిఖీక్రింద జరిగే క్షామనివారణ కార్యాలకు పై డబ్బును ఖర్చుపెట్టవలసిందని కోరారు. అందులో 1000 రూపాయలను చిటగాంగు కమ్యూనిస్టులకు ప్రత్యేకించవలసిందని కోరుతూ బెంగాల్ కమ్యూనిస్టుకమిటీకి వ్రాశారు.

"జపానుఫాసిస్టులనుండి మన సరిహద్దులను కాపాడుతూ తమ ప్రాణాలను ఒడ్డుచున్న ఈ దేశభక్తుల యెడల మావాత్సల్యతను గుర్తించకుండా ఉండలేము.

"మనదేశం ఒక మహా క్లిష్ట దశను ఎదుర్కొన్నది. ఇట్టిసమయంలో కుల,మత, వర్ణభేదాలు లేకుండా, బెంగాల్ దేశభక్తులకు సాయం చేయడానికి అన్నివిధాల కృషి చెయ్యాలి.

"వారి (చిటగాంగు కమ్యూనిస్టుల) మహోజ్వల త్యాగంవల్లా, శౌర్యంవల్లనే, భారత దేశాన్ని కబళించాలనే ఫాసిస్టుల కలకల్లగానే ఉండిపోయింది.

"టాగూరు మహాకవియొక్క జన్మస్థానమైన బెంగాల్‌లో ఈ దేశభక్తులు చేసే త్యాగాన్ని జూచి మన దేశం గర్వపడుతోంది. ఆరాష్ట్రానికి సహాయం చేయడం అంటే మన దేశానికే సహాయపడటం అన్నమాట.

"మీ కమ్యూనిస్టు వర్కర్లయెడ మా బాధ్యత ఇదే నను తలంపుతో - 1000 రూపాయలను ఇందుకు ప్రత్యేకించాము."

5 లక్షల పార్టీఫండుకు సైగల్ జోలితోతిరిగాడు

సైగల్ నెరుగని సినిమాకళాప్రియుడుండడు సైగల్ జోలిపుచ్చుకొని కమ్యూనిస్టు పార్టీ ఫండుకు డబ్బు వసూలు చేస్తుంటే, డెహ్రాడున్ (యు. పి. రాష్ట్రం) నగరవాసులంతా ఆశ్చర్య చకితులయ్యారు.

సెప్టెంబరు 19 వ తేదీన కమ్యూనిస్టు పార్టీ ఫండుకుగాను వివిధ ప్రదర్శనాలను ఏర్పాటు చేశారు. ఒకదానిలో సైగల్ పాల్గొని కొన్ని పాటలు పాడాడు. మరికొందరు కళావేత్తలుగూడా పాల్గొన్నారు. అందులో సుప్రసిద్ధ భరతనాట్య కళావేత్త గోపీనాథ్ శిష్యుడునూ, మానవ్‌భారతిలో నర్తనాచార్యుడునూ అయిన బాలకృష్ణన్‌కూడా పాల్గొన్నాడు.

సైగల్ స్వయంగా 200 రూపాయలు వసూలుచేశాడు. భారతదేశానికి కమ్యూనిస్టు పార్టీగావించుచున్న కృషి తనను ఆకర్షించిందనీ, తనకు చేతనయినంత వరకు పార్టీకి సహాయపడుతూ ఉంటానని చెప్పాడు.

బాధ్యతనెరిగిన కార్మికులు తమ శక్తిని తామే మించిపోతారు

చైతన్యవంతుడయిన కార్మికుని శక్తి ఇంజనీర్లు మొదలైన ఉద్యోగుల అంచనాలను ఎన్నోరెట్లు మించిపోయి ఉంటుంది. తన దేశము, తన ప్రజల క్షేమం తన పైని ఆధారపడి ఉందన్న సంగతి గ్రహించిననాడు కార్మికుడు తన శక్తిని తానే మించిపోతాడు.

మన దేశంలో ఇందుకు లెక్కలేని నిదర్శనాలు కనబడుతున్నాయి.

బీహారు రాష్ట్రంలో గిరిధి అనే చోట బొగ్గుగనులున్నాయి. ఫ్యాక్టరీల ఉత్పత్తికి, రవాణాకు, కుటుంబ జీవనానికి, దేశరక్షణకు బొగ్గు ఎంత అవసరమో, ఆబొగ్గు గనుల కార్మికులు గుర్తించారు. బొగ్గును ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి నిశ్చయించుకున్నారు. అందుకు తగిన ప్లానువేసి, యజమానులకు చూపించారు. యజమానులు తమకింద ఉన్న నిపుణులతో ఆలోచించారు. ఈ యుద్ధం రోజుల్లో ఎక్కువ వుత్పత్తికి తగిన సౌకర్యాలు కలిగించడం అసంభవం అని ఆ నిపుణులు సెల విచ్చారు. కాని, కార్మికులు తమ పట్టు వదలలేదు. చివరికి వారు కోరిన ఏర్పాట్లు కొంతవరకు యజమానులు చేయక తప్పిందికాదు. గనులలో కార్మికుల చేతులు చక్కగా ఆడడానికి తగిన సౌకర్యం కలిగించారు. బొగ్గును బయటికి తీసుకుపోయే తొట్టులు మరమ్మతు చేయించారు. కార్మికులు అమితోత్సాహంతో అధికోత్పత్తికి పూనుకున్నారు.

సెప్టెంబరు మొదటి తేదీని అయిదు గనులలో ఉత్పత్తి 1,125 టన్నులు. సెప్టెంబరు 25 వ తేదీని ఈ ఉత్పత్తి 1,806 టన్నులకు పెరిగింది.

అంటే మునుపటికన్నా ఇప్పుడు రోజుకు 681 టన్నుల బొగ్గును అధికంగా ఉత్పత్తి చేస్తున్నారన్నమాట.

ఇంతవరకు బొగ్గు చాలక రైళ్ళ రాకపోకలకు ప్రమాదంకలిగేలాగుండేది. ఇప్పుడు అధికోత్పత్తి అవుతూన్న బొగ్గును రవాణా చేయడానికి చాలిన వాగన్లు దొరకడంలేదు. అంటే ఇ. ఐ. ఆర్; బి. యన్. ఆర్. రైల్వే కార్మికులు గిరిధి బొగ్గుగని కార్మికులతో పందెం వేసుకోవాలన్నమాట.

బొగ్గును ఇలా ఎక్కువగా ఉత్పత్తి చేస్తూ, దానికి సంబంధించిన ఇతర పరిశ్రమలనుకూడ గిరిధి కార్మికులుదీక్షతో కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు బెంకాల్ అనే ద్రావకం రిజర్వాయర్ నిండి, పైకి పారింది. కొత్త రిజర్వాయర్ కట్టించండని అధికారుల మీద కార్మికుల ఒత్తిడి ప్రారంభమయింది.

గిరిధి కార్మికులఈదీక్షను, ఇందుకుతగిన ఉత్సాహం కలిగించిన అక్కడి కమ్యూనిస్టులను చూచి ఏ దేశం గర్వపడదు?

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు

అక్టోబరు 8, 9 తేదీలలో అఖిలభారత ట్రేడ్‌యూనియను కాంగ్రెసుకు అనుబంధ సంఘమైన ఆంధ్ర ట్రేడ్‌యూనియను సంస్థల ప్రతినిధులు బెజవాడలో కామ్రేడ్ సి. వి. కె. రావు అధ్యక్షతను సమావేశమయారు. ఆంధ్ర రాష్ట్రంలోని యూనియనుల పనిని కోఆర్డినేటు చేయుటకు, అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసునిర్ణయములను అమలు పరచుటకు, రాష్ట్రంమొత్తంమీద పరిశ్రమవారీగా కార్మిక సంఘాలనువృద్ధిచేయుటకు, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్ యూనియను కౌన్సిలుకింద అఫిలియేటయిన యూనియనులు సిర్మింపబడ్డాయి. అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు నిర్ణయించిన నిబంధనావళి ఒకటి ఆమోదింపబడింది. 1 సంవత్సరంలోగా ఏర్పడిన యూనియనులు అసోసియేటు యూనియనులుగా తీసుకోబడ్డాయి. యీదిగువ తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

(1) 1 సంవత్సరం పైగా ఉన్న యూనియనులు అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు అఫిలియేటు కావలెను.

(2) యూనియనులో నూటికి నూర్గురుమంది సభ్యులుగా చేరవలెను.

(3) కాంగ్రెసు నాయకుల విడుదల కొరకు, జాతీయప్రభుత్వ స్థాపనకొరకు ఆందోళన గావించుచున్న బ్రిటిషు, ఆస్ట్రేలియను ట్రేడ్ యూనియను కౌన్సిలుకు అభివందనాలు అర్పించడమయింది.

(4) అధికధరల వేతనములు, బోనసు, బట్టల కంట్రోలుబోర్డు, జీవనోపాధికై సంఘ బాధ్యత, నిరుద్యోగము, జమాల్‌పూర్ రైల్వే సమావేశ చర్యల ఖండన, రాజకీయ ఖైదీల విడుదల మొదలగు విషయములపైతీర్మానాలు ఆమోదించబడ్డాయి. బెజవాడ ఫౌండ్రీ పనివారలకు యజమాని చేసిన అన్యాయమును పరిష్కరించుటకు ప్రభుత్వము యిప్పటివరకు చూపిన నిర్లక్ష్యతను నిరసించుతూ, మదరాసు ప్రభుత్వ ఎడ్వైజరును కలుసుకొనుటకు మదరాసు ట్రేడ్ యూనియన్ కమిటీ ఏర్పరచిన డెలిగేట్సు కమిటీని బలపరుస్తూ తీర్మానించడమైంది. ఆంధ్రరాష్ట్ర జ్యూట్ పనివారల హక్కులగురించి, మ్యునిసిపల్ పనివారల అధికధరల వేతనముల గురించి, మైకా పనివారల యిబ్బందులు, తక్కువ వేతనములగురించి, ఫ్యాక్టరీ, ప్రెస్ పనివారల నిరుద్యోగము గురించి, రాజమండ్రి పేపరు కార్మికుల హక్కుల గురించి ఆయా యూనియనుల తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

★ రైతు — కూలీ సమస్యలు

కూలీలకు రైతుల సహాయం

అమలాపురం తాలూకా, గూడాల గ్రామంలో (తూ, గోదావరిజిల్లా) వ్యవసాయ కూలీసంఘం 2 యకరాలబంజరును సాగుకు తెచ్చారు. 25 బస్తాలు పండుతుందని అంచనా, ఈలోగా కూలీలకు గింజల అవసరం ఎక్కువైంది. రైతుల్ని వడ్డీలేకుండా గింజలు అప్పుగా ఈయవలసిందని కోరారు. ఒకరైతు 12 బస్తాలధాన్యంయిచ్చి, కూలీలకు సహాయంచేశాడు. ఒక్కొక్కరు 3, 4 కుంచాల వంతున పేదకూలీలంతా పంచుకున్నారు. కరువురోజుల్లో యీ సహాయం కూలీలను అధికాహారోత్పత్తికి ప్రోత్సహింపుతోంది.

ఇండ్లు పడిపోయినవారికి సహాయం

తలమంచి గ్రామ పరిసరాల్లో (నెల్లూరు జిల్లా) షుమారు 20 రోజులనుంచి వర్షం విపరీతంగా కురియుటవల్ల 20 యిండ్లు పడిపోయాయి. గ్రామంలోని హరిజన కూలీలు తిండిలేక, యిండ్లులేక మాడుతూంటే ఆ గ్రామ రైతుసంఘంవారు ఆరాత్రి భోజన సదుపాయాలు చేసి, మరునాడు గ్రామంలో బియ్యము, ధాన్యం వసూలుచేసి యిచ్చారు. ఇండ్లకు కావలసిన తాటిచెట్లు వగైరా సప్లయి చేయవలసిందని కోరుతూ స్థానికాధికారులకు పిటిషన్లు పెట్టారు.

వర్షాలకు 500 యకరములముంపు

కోవూరు తాలూకా, ఊటుకూరు గ్రామంలో (నెల్లూరుజిల్లా) 8 సంవత్సరాలక్రితం పెన్నానదికి ఉత్తరపుకట్ట ఊరికి పశ్చమటగా 1 మైలులో తెగిపోయిఉంది. పి. డబ్ల్యు. డి. వారుగాని, ప్రభుత్వంగాని దాన్ని పూడ్పించలేదు. ఈమధ్య ఆప్రాంతాలలో వర్షాలు అధికంగా కురియుటవల్ల 17 వ తేదీని నదికి నీరు జాస్తిగా వచ్చి, గండిగుండా నీరు ప్రవహించి, షుమారు 500 యకరముల భూమిని ముంచివేసింది. ఇట్టి అశ్రద్ధవల్ల అధికాహారోత్పత్తికి కలిగే నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి, యిప్పుడైనా గండిని పూడ్పించే యేర్పాటు చేయవలసినదిగా ఆ గ్రామ యువజన సంఘం వారు కోరుతూ తీర్మానించారు.

ఇరిగేషన్ చట్టం: రైతుసంఘాలు తీసుకోవలసిన చర్యలు

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి నంబూరి ప్రసాదరావుగారిలా ప్రకటిస్తున్నారు:

గత మార్చిలో జరిగిన రాష్ట్రసంఘ సమావేశంలో, ఎస్టేట్లలో ఉన్న జలాధారాలను ప్రభుత్వమే స్వయంగా మరమ్మతు చేయించాలనీ, బంజర్ల నన్నిటినీ సాగుకు యివ్వాలనీ, కోరబడింది. అన్ని జిల్లాలలోను యీకోర్కెలను బలపరుస్తూ రైతుసంఘాలు ఆందోళన చేశాయి. చివరకు ప్రభుత్వం ఎస్టేట్లలోని జలాధారాల మరమ్మతుకై ఒక బిల్లును, బంజర్లను సాగులోకి తెచ్చుట కొకబిల్లును, ప్రకటించింది. ఎంతో ఆందోళన చేసిన మీదట ఇరిగేషన్ బిల్లును యిప్పుడు ఆక్టుగా ప్యాసుచేసింది. ప్రభుత్వం యిందులో రాష్ట్ర రైతుసంఘ సూచనలను అంగీకరించలేదు. అయినా, వెంటనే రైతుసంఘ వర్కర్లు అశ్రద్ధచేయక, ఆక్టును రైతుల కుపయోగపడేటట్లు యీ క్రింది చర్యలను తీసుకోవాలి.

1. ఎస్టేటు, అగ్రహారం, మొఖాసా, యీనాం గ్రామాలలో చెరువులు, కాలువలు, నీటివనర్లు వగైరాలమరమ్మతులు, అందువల్ల సాగుబడి ఎక్కువ అగుటకు గల వీల్లు, ప్రభుత్వ జలాధారాలనుండి నీటిని తెచ్చుకొనే వీల్లు, పరిశీలించాలి.

2. మరమ్మతులు కాకపోతే ఎంత నష్టం కలుగుతుందో అంచనావేయాలి.

3. మరమ్మతులు, అభివృద్ధులు, మొదలైన వాటికి అయే ఖర్చును అంచనా వేయాలి.

4. ఈ వివరాలతో గూడిన మహజరుపై ఆయకట్టు రైతులలో అధమం నాల్గవవంతు మంది చేవ్రాలు, నిశానీలు చేయించి, రిజిష్టరు పోస్టుద్వారా కలెక్టరుకు పంపాలి. కాపీని జిల్లా రైతు సంఘానికి పంపాలి.

5. తనిఖీకై అధికారులు వచ్చినప్పుడు అవుసరమైన భోగట్టాను అందజేయాలి.

త్వరలో జలాధారాలన్నీ బాగుపడి, వచ్చే సంవత్సరానికైనా ఎక్కువ పంటలు పండించుటకు వీలు కల్గునట్లు కృషిచేయాలి.

రాష్ట్ర రైతుసంఘ వర్కర్ల కరువునివారణ కృషి

మా జిల్లాలో కరువు చాలా తీవ్రంగా వున్నది. దీని నివారణకు ప్రభుత్వము 30 కరువు నివారణకేంద్రాలు పెట్టి పనులు చేయించుతూవున్నది. ప్రజలు యీవిధంగా కరువు కాటకాలవల్ల బాధపడుతూవున్నందువల్ల తన్నివారణార్థము అనేకమంది వ్యక్తులు, సంస్థలు, ధన ధాన్య వస్త్రరూపేణా మా జిల్లాలోని కరువుపీడితులకు తమ సహాయ సానుభూతులను అందజేస్తూవున్నారు. అందుకు మా కృతజ్ఞతాభివందనాలు.

యిట్లే యికముందుకూడా ఆయాసంస్థలు, వ్యక్తులు, తమ శక్త్యనుసారము విరాళాలు పంపుతూవుండాలని కోరుచున్నాము. అంతేగాకుండా కరువుక్యాంపులలో పనిజేసే కూలీలకు చాలాకష్టాలువుంటాయి. వాటినితొలగించి వారికి సక్రమ సదుపాయాలు కలుగజేయాలంటే స్వచ్ఛంద సేవకులు అవసరము. యీవిషయములో ఆంధ్రరాష్ట్రరైతుసంఘము పంపిన వర్కర్లు చాలా కష్టాలకోర్చి పనిజేసి కూలీలకు చాలా సదుపాయాలు చేయించకలిగారు. యిందుకు వారికి ప్రత్యేకవందనాలు.

ఈ విధంగానే కరువు నివారణకు తోడ్పడుతూవున్న అన్నిసంస్థలు స్వచ్ఛంద సేవకులను పంపి కరువు బాధితుల కష్టాలను పోగొట్టడానికి తోడ్పడవలసినదని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు,
అవవాని గోవిందయ్య,
పంచాయితీబోర్డు ప్రెసిడెంటు,
చిన్నహోతూరుగ్రామం, బళ్లారిజిల్లా.

(3వ పేజీ తరువాయి) వాడు నక్కజిత్తులు మానలేదు:—నిప్పు చూరు కంటుకుంది—

గాలి యింటివేపే వీస్తూంది. వరుగులు పెడుతూ మంటలొస్తున్నాయి: ఇంటిని పొగలు కమ్ముకుంటున్నాయి.

"లెండి! లేవండి వేగం!! మన యిల్లూ అంటుకొంటే, వున్న యిప్పకూడా మసైపోతాయి—వాళ్ళని కూడా అన్యాయం చేసినవాళ్ళమవుతాం!"

గగ్గోలులోంచి, పొగలలోంచి, చీలుకొంటూ గంభీరంగా కేక వినిపిస్తూంది....

ఒకళ్ళమొఖం యింకొకళ్ళు చూసుకుంటున్నారు.

"ఇల్లు మన దన్నమాట జ్ఞాపక ముంచుకోండి! మాట పొందక.... యింటినిన్నాళ్ళూ వాడిపరంచేసేం—యిప్పుడు మన కళ్ళముందే కాల్చుకుంటున్నాం."

కొందరు వింటున్నారు. వింటే మనసు మారిపోతుందేమోనని కొందరు చెవులు మూసుకున్నారు.

"ఇప్పటికైనా—పదండి యింటిని కాపాడుకుందాం—ఒక్కమాటమీద నిలబడండి—వాడు మనముందాగలేడు!"

ఇంకా గట్టిగా, ఇంకా స్పష్టంగా కేక వినిపిస్తూంది.

"ఇల్లు మనది—ఎప్పటికైనా మనదే—లెండి—పదండి"

పిలుపు ప్రతిధ్వనిస్తూంది. ఆవేవు తత్తరగా వింటున్నారు. ముఖాలు చూసుకుంటున్నారు. వారి హృదయాల్లోనూ, వారి ముఖాలమీదా ప్రశ్నార్థక చిహ్నాలు సూదుల్లాగ గుచ్చుకుంటున్నాయి—గుచ్చుకునే వున్నాయి.

ప్రజలు ఏకమైతే అధికారుల మొండితనం ఒకఅడ్డా?

సూర్యాపేట(నల్లగొండజిల్లా, నైజాం)లో కొన్ని వర్తకకుటుంబాలకు స్థానిక తహసీల్దారు పంచదారకు రేషన్‌కార్డులివ్వ నిరాకరించాడు. విజ్ఞప్తులు పట్టుకువెళ్ళేవారి మీద విరుచుకుపడేవాడు. ఈలోగా కొంతమంది కామ్రేడ్సు జైలునుంచివిడుదలఅయివచ్చారు. రాగానే వీరు వర్తకులను కలుసుకొని - ఒక్కొక్కరుగవెళ్ళితేలాభంలేదు: పంచదార, కిరసనాయిల్ ఎంతెంత కావాలో లెక్కలుతీసి అందరూ కలిసి మహజరుపెట్టి వెళదాము అని నచ్చచెప్పారు. ఆప్రకారం లెక్కలుతీసి 30 మంది సంతకాలుగల మహజరును పట్టుకొని, హిందువులు, ముస్లింలు, అంతా కలసి ఈనెల 10 వ తేదీని తహసీల్దారు దగ్గరకు వెళ్ళారు. ఈకుటుంబాల స్థితికి తహసీల్దారు ఈసారి సానుభూతిని తెలిపి, వారి అవసరాలనుబట్టి పంచదారకు వెంటనే రేషన్‌కార్డులిప్పించాడు. కిరసనాయిల్ విషయం కొద్ది రోజుల్లో తెలుపుతానన్నాడు.

వెంకటగిరిలో

వెంకటగిరిలో 4200 కుటుంబాలున్నాయి. ఆ ఊరికి కిరోసిన్ తెల్లనూనె 134 డబ్బాలు, ఎర్రది 50 డబ్బాలు మాత్రమే సప్లయి అవుతూంది. వీటిలో పర్మిట్లకు, పల్లెలకు పోగా మిగిలిన 50 టిన్నుల ఎర్రనూనె, 50 టిన్నుల తెల్లనూనె మాత్రమే ప్రజలకు అమ్మడానికి మిగులుతుంది. ఈ అమ్మకానికి 15 మంది లైసెన్సుదారు లున్నారు. అమ్మకంలో అక్రమాలకు, డిపోదగ్గర తొక్కిళ్ళకు అంతులేదు.

స్థానిక కమ్యూనిస్టులు ఈ పరిస్థితిని సరిదిద్దటానికి పాటుబడ్డారు. ఈమాసం ప్రజాందోళన ఫలితంగా నాయుడుపేటనుంచి 60 టిన్నులు అదనంగా సప్లయి అయాయి. ఇండ్లలెక్కలనుబట్టి, గలభాలేకుండా నూనె పంచిపెట్టడంకోసం, 8 మంది కమ్యూనిస్టులు, ఇద్దరు విద్యార్థులు, కొందరు సానుభూతిపరులు 3 దళాలుగ ఏర్పడి లెక్కలుతీశారు. ఈ లెక్కలనుబట్టి ఇంటింటికి చీట్లిచ్చి, ప్రతి కుటుంబానికి నూనె అందేలా చేస్తామని వర్తకులకు చెప్పారు. కొందరు అంగీకరించారు. కాని మరికొందరు వర్తకులు, అధికారులు అడుగడుక్కీ అంతరాయాలు కలిగించారు. ప్రజాసేవకుల పద్ధతికి విరుద్ధంగా మేజస్ట్రీటు అనుమతితో నలుగురు వర్తకులు కిరసనాయిల్ అమ్మకం ప్రారంభించారు. యథాప్రకారం మళ్ళీ గలభా, వెంటనే వాలంటీర్లు అక్కడికివెళ్ళి నూనె దొరక్క అల్లాడుతున్న వారిలో 200 మందిని వెంటబెట్టుకొని మేజస్ట్రీటు దగ్గరకు వెళ్ళి పరిస్థితులను విశదపరిచారు. ఇంటింటికి చీట్లు పంచేవరకు ఈ విధంగా అమ్మడం ఆపించాలని కోరారు. ఈసారి మేజస్ట్రేటు వినకతప్పిందికాదు - వర్తకులు, ప్రజలు ఇష్టపడితే మీఇష్టం వచ్చినట్లు ఏర్పాటుచేయండని చెప్పాడు.

రెండురోజులు కిరసనాయిల్ అమ్మకం ఆపి, ఇళ్ళ లెక్కలు తీశారు, చీట్లు పంచారు. కుటుంబానికి ఒక్కొక సీసా చొప్పున పంపకం ప్రారంభించారు. రోజుకు రెండేసి వార్డుల్లో అమ్ముతున్నారు. ప్రజలకేమాత్రం ఇబ్బందిలేకుండా అంతా సాఫీగా సాగిపోతూంది. ప్రజాసేవకుల ప్రచారఫలితంగా వర్తకులు కూడా అక్రమ అమ్మకాలను వదలి, ఈ పద్ధతికి అంగీకరించారు.

కిరసనాయిల్ సమస్య ఈవిధంగా పరిష్కారమయింది. ఇంతలో కట్టెల కరువు వచ్చింది. జమీందారుగారు రెండు కట్టెల డిపోలు పెట్టించేలా చేయడానికి వివిధ వర్గాలను, పార్టీలను ఐక్యపరచి కృషి ప్రారంభించారు.

తిండిదొంగపై కేసు

కాటూరు (కృష్ణాజిల్లా) కోఆపరేటివ్ స్టోర్సు అధ్యక్షుడు వెల్లంకి వెంకట కుటుంబయ్యగారు 7 పంచదార బస్తాలను బెజవాడ దొంగమార్కెట్టుకు ఎగుమతి చేయడానికి ప్రయత్నించడం, ప్రజాసేవకుల శ్రద్ధవల్ల ఈ దొంగతనం బయటపడి ఆ సరుకును పోలీసులు స్వాధీనం చేసుకోవడం 13-10-43 ప్రజాశక్తిలో ప్రచురించాం. 20-10-43 న వీరిని పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటు అరెస్టుచేశారు. బెజవాడ సబ్‌కలెక్టరు మధ్నాడు అతనిని జామీనుమీద విడుదలచేశారు.

ఆహార కమిటీలు

గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా ఆహార కమిటీ 14-10-43 న సమావేశమయింది. తాలూకాలో కరువు పరిస్థితులను తొలగించడానికి భృగుబండ ప్రాజెక్టు, క్రోసూరు యిసుకవాగుకు ఆనకట్ట కట్టించడం వెంటనే ప్రారంభించాలని ఈ సమావేశం తీర్మానించింది. వీటివల్ల 1600 యకరాలు అదనంగా సాగుబడిఅయి, ధాన్యంకొరతను కొంతవరకు తీర్చగలదని తీర్మానం తెలిపింది. కొల్లూరు వెంకటాయపాలెం రిజర్వు ఫారెస్టులోని తిక్కనిచెరువులోని 600 యకరాలను అధికాహారోత్పత్తికి సాగుచేయించాలని తీర్మానించారు.

జొన్నల ధర 17-0-0, సజ్జలు 18-0-0, బియ్యం కృష్ణాజిల్లా ఆహార కమిటీ తీర్మానించినట్లుగాను ధరలు నిర్ణయించాలని మరో తీర్మానం కోరింది. రైతులు తమ అవసరాలకు మించిన ధాన్యాన్ని ఆహార కమిటీల కిందనున్న చౌకడిపోలకు అమ్మాలని తీర్మానించారు.

గుంటూరుజిల్లాలోని పొన్నెకల్లుగ్రామంలో 11-10-43 న ఆహారసభ జరిగింది. యీ సభలో ఆహార కమిటీని ఎన్నుకున్నారు. దీనికి అధ్యక్షులు శ్రీ దామినేనిసంగయ్యగారు; కార్యదర్శి కామ్రేడ్ యేరువ వెంకటరెడ్డి.

కడప తాలూకా అలంఖాన్ పల్లెలో 15-10-43 న ఆహార కమిటీ స్థాపించబడింది. కమిటీకి శ్రీ యన్. సుబ్బారెడ్డిగారు, అధ్యక్షులు, శ్రీ జి. పెద్దిరెడ్డిగారు కార్యదర్శి, శ్రీ యన్. నాగిరెడ్డిగారు సహాయ కార్యదర్శి, ఇద్దరు హరిజనులు, ఇద్దరు ముస్లిములు ఇద్దరు రైతులు, ఒక వర్తకుడు, ఒక వడ్డె కార్యనిర్వాహకవర్గ సభ్యులుగాఎన్నుకోబడిరి.

బాలసంఘం

"జ్వాయెంగే - కయ్యూరు జాయెంగే" అన్నపాటను విన్నారుగదూ. ఆకయ్యూరు వీరులగన్న భూమియే మలబారు. అమలబారులో కరివెల్లూరు అనే గ్రామంవుంది. కోరాన్, మొట్టుకన్ అనే ఇద్దరు పిల్లలున్నారు. అఊళ్ళో బాలసంఘంవుంది. కాని వీళ్ళిద్దరూ చేరలేదు.

కరివెల్లూరులో ప్రతిరోజూ రాత్రిళ్ళు పొలాల్లో ధాన్యం దొంగతనం జరుగుతు దేది బాలసంఘం ఇది తెలుసుకొని, రాత్రింబవళ్ళు ఒకరి తర్వాత ఒకరిని నియమించి కాపలా గాయించింది.

ఒకరాత్రి కోరాన్, మొట్టుకన్ అనే బాలురిద్దరూ దొంగతనముచేస్తూ పట్టుబడ్డారు. బాలసంఘ వాలంటీర్లు వారిని చీవాట్లుపెట్టి పంపించారు. కాని వాళ్ళు దొంగతనం మానలేదు. ఇలాగే మరొకరాత్రి పట్టుబడ్డారు. ఈసారి వాలంటీర్లు వదలిపెట్టలేదు. 60 మంది బాలసంఘ సభ్యులూ ఆ "గజదొంగల్ని" ముందు పెట్టి నడిపిస్తూ, నినాదాలతో సంఘం ఆఫీసుకు ఊరేగింపు తీసుకువెళ్ళారు.

ఆఫీసువద్ద మీటింగు జరిగింది. అబాలురిద్దరూ తమనేరాన్ని ఒప్పుకున్నారు. అలా వాళ్ళు ఒప్పుకొంటూచెప్పినదంతా బాలసంఘం వ్రాసుకొంది. దొంగల్ని పట్టుకొన్న వాలంటీర్లను అందరూపొగిడారు.

దొంగతనంచేసినపిల్లలిద్దరూఇలాఅన్నారు: "ఇకనుంచి దొంగతనం చేయం. మేంకూడా బాలసంఘంలో చేరతాం. మన వూరి పరువు కాపాడుతాం."

వీళ్ళు ఇదివరకు 10 శేర్ల ధాన్యం దొంగతనంచేసి, కత్తుక్కుత్తిపడే వర్తకుడికొకడికి రెండణాల కమ్మారు. ఆ రెండణాలు, ఇదివరకు తాము తమ ఇంట్లో దొంగిలించిన 8 అణాలక్రింద, తల్లికిచ్చారు.

మీటింగులో వీరిద్దరి విచారణజరిగేసరికి, 100 మంది బాలబాలికలు ప్రోగయ్యారు. వీరంతా వర్తకుడి దగ్గరకెళ్ళి, అతనిగుట్టు బయటపెట్టి అవమానపరచారు. అతడు కొన్న ధాన్యం అసలుయజమానికిప్పించారు. తర్వాత ఆ పిల్లల నిద్దరినీ వాళ్ళతల్లి దగ్గరకు తీసికెళ్ళారు.

●

ఇలాగే ఇంట్లో దొంగతనంచేసి చీట్లపేక ఆడే ఒక కుర్రవాడు బాలసంఘంలో చేరాడు. ఇతనిది గుడివాడ తాలూకా గురజ. ఇపుడు గంపలగూడెంలో ఉంటున్నాడు. అతడిలా చెప్పాడు: "నేను గురజలో ఉండేటప్పుడు రౌడీగా ఉండేవాణ్ణి. రోజుకు 5 సిగరెట్లు పెట్టెలు త్రాగేవాణ్ణి. చీట్లపేక ఆడడానికి ఇంట్లో దొంగతనం చేసేవాణ్ణి. ఈవూరువచ్చి బాలసంఘంలో చేరాక ఆదురభ్యాసాలన్నీ మానాను."

●

పశ్చిమగోదావరిలో బాలసంఘం వాళ్ల ఒక కొత్తఆట ఆడుతున్నారు. అదిహిట్లరు-టాన్యా ఆట. పులిమేక ఆట మాదిరిగా ఉంటుంది. ఆ ఆటలో ఇలా పాడతారు.

"హిట్లరొచ్చెటాన్యా- దాక్కోవె టాన్యా!
ఫాసిస్టువచ్చె టాన్యా- పరుగెత్తు టాన్యా!
జర్మనీ వచ్చె టాన్యా- జాగ్రత్త టాన్యా!
యుద్ధము వచ్చుటాన్యా- యెదిరించుటాన్యా!!

ఇదంతా అందరు కలిసి పాడతారు. తర్వాత హిట్లరు, టాన్యా వరసగా చెరోపదం అంటూ ఈ క్రింది విధంగా పాడతారు.

హిట్లరు

"రష్యాను మ్రింగుతాన్
స్టాలిన్ని పడతాన్
ఫిరంగులూ పేల్చుతాన్
టాన్యాను చంపాన్

టాన్యా

హిట్లరును చంపుతామ్
చావచితక తన్నుతామ్
గెరిల్లాలమౌతామ్
హిట్లరునే పట్టామ్"

పిల్లలందరూ గుండ్రంగా చేతులుకట్టి నిలబడతారు. హిట్లరు బైటనిలబడతాడు. టాన్యా లోపల వుంటుంది. "టాన్యాను చంపాన్" అని అంటూ హిట్లరు లోపలికి దూరబడి టాన్యాను పట్టుకొంటాడు. "హిట్లరునే పట్టామ్" అన్నప్పుడు అందరూ అతనిపైబడి కాళ్లూ చేతులు కట్టేయాలి. మీరూ నేర్చుకోండి ఈఆట.

దొడ్డమ్మ

ముస్లింలు - హిందువులు బెంగాలు సోదరులకు తోడ్పాటు

తిరువూరు తాలూకా గౌరంపాలెంలో రంజాన్ పండుగనాడు కామ్రేడ్ సయ్యద్ సాలార్, తిరువూరుతాలూకా రైతుసంఘ ప్రెసిడెంటు, బెంగాలు కరువునిధి కొరకు ప్రార్థన అయిన తరువాత అప్పీలుచేయగా, అక్కడి ముస్లిం ప్రజలు బీదరైతులు, రంజానులో చేయవలసిన ధర్మం బెంగాలుకు పంపించుతాము అని జేబులలో వేసుకొని వచ్చినారు. కామ్రేడ్ సాలార్ బెంగాలు కరువునిగూర్చి, ఐక్యతను గురించి, అధిక పంటలనుగురించి విపులముగా చెప్పిన తరువాత ఒక్కొక్కరు లేచి బెంగాలుకు సహాయపడతాం, అధిక పంటలు పండించుతాం అంటు, అయిదు నిమిషములలో రు 14—9—6 బెంగాలు కరువునిధి యిచ్చినారు. అవి మనియార్డరు ద్వారా బెంగాలుకు పంపించినారు.

6—10—43 వ తేదీ "ప్రజాశక్తి"లో బెంగాల్ కరువును గురించి ప్రచురించబడిన వ్యాసం ఒరిస్సాయందలి ఏజన్సీ యువకుల్ని ఉత్తేజపరిచింది. కోరాపుట్ జిల్లాలో మోటు అనేగ్రామ యువకుల్ని పైవ్యాసం కదలించింది. ఆంధ్రయువజనసంఘం అనే పేరుతో వారొక సంఘాన్ని స్థాపించుకొని, బెంగాల్ కరువునిధికి చందాలు వసూలు చేశారు. 12—10—43 నాటికి రు. 42-12-0 వసూలయింది. మనియార్డరు కమీషన్ రు 0—10—0 పోను, మిగతా రు 42—2—0ను "ప్రజాశక్తి" కార్యాలయానికి పంపించారు. పదరు సొమ్ము "బెంగాల్ పీపుల్సు రిలీఫ్ కమిటీ"కి పంపబడింది.

మోటుయువకులు ఇంకా సహాయంచేయుటకు వసూళ్ళు కొనసాగిస్తున్నారు. ఇద్దరు యువజనసంఘ సభ్యులు కలిసి ప్రతినెల రు 6—0—0 చొప్పున బెంగాల్ కరువునిధికి పంపుటకు నిశ్చయించుకున్నారు.

★

స్త్రీలపాటలు కావాలి

ప్రస్తుతము మన సమాజములో స్త్రీలు అనుభవిస్తున్న కష్టాలనుగూర్చి, ఫాసిస్టు దురాక్రమణ నెదుర్కొనుటనుగూర్చి స్త్రీలకందరికివచ్చే సులభశైలిలో చక్కని చిన్న చిన్నపాటలు వ్రాసి, కృష్ణాజిల్లా మహిళాసంఘానికి పంపవలసినదని కోరుచున్నాము. పాటలు వ్రాసేవారు, ఆపాట ఏవరుసనున్నది వ్రాయవలెను. మంచిపాటలు వ్రాసినవారికి 10 రూపాయిలు బహుమానం ఇవ్వబడును.

అడ్రసు:- కృష్ణాజిల్లా మహిళాసంఘం,
గోవిందరాజులనాయుడువీధి,
సూర్యారావుపేట : బెజవాడ

3 వ పశ్చిమగోదావరిజిల్లా యువజన మహాసభ

ఈ నెల 14, 15, 16, 17వ తేదీలలో 3వ పశ్చిమగోదావరిజిల్లా యువజన మహాసభ ఏలూరులో జయప్రదంగా జరిగినది. 14, 15 తేదీలలో ఆటల పోటీలు జరిగాయి. జిల్లా అంతటినుంచి 40 టీములు (280 మంది ఆటగాండ్రు) వచ్చాయి. వర్షములు విపరీతమగుటవలన ఫైనల్సు వాయిదా వేసినారు. ఉపన్యాస పోటీలలో 15 మంది పాల్గొన్నారు.

16 వ తేదీన జిల్లా ప్రతినిధుల సమావేశం, గారపాటి యుగంధర్‌గారి అధ్యక్షతను జరిగినది. అన్ని తాలూకా, పట్టణ సంఘాలనుండి 117 మంది ప్రతినిధులు హాజరైనారు.

తీర్మానాలు

మొదట పెంటపాడు తాతయ్య, భూపతి వెంకటరత్నం, పర్వతనేని వెంకటేశ్వర్రావు, శాంతి చక్రవర్తి, బేగంఅజాద్, సత్యమూర్తి, టాగూర్ మొదలయిన దేశభక్తుల మరణానికి సమావేశం సానుభూతి తెలిపింది.

ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అనేక విజయాలు సాధించుచున్న వీరయువకులకు, జైళ్ళలో మ్రగ్గు ఫాసిస్టు వ్యతిరేక యోధులకు, అభివందనాలర్పించిరి. ఆయుధ శాసనం రద్దుగావాలనియు; ఐక్యతతో ఆహార సమస్యను పరిష్కరించుట ద్వారా, జాతీయైక్యతతో, జాతీయ నాయకులను విడిపించి దేశరక్షణ, జాతీయప్రభుత్వం సాధించి జపాను ఫాసిస్టులనుండి దేశాన్ని కాపాడాలనియు; పౌరసత్వహక్కులపై: జిల్లాలో ఒక కాలేజి ఏర్పాటుచేయాలని మొదలయిన విషయములపై తీర్మానించారు. ప్రథమంలో కార్యదర్శి కామ్రేడ్ పట్టాభి రామారావు రిపోర్టుయిస్తూ, యీ నాటికి జిల్లాలో 107 గ్రామాలలో 3000 సభ్యత్వం కలిగియున్నదని తెల్పారు.

నూతన సంవత్సరమునకు యీ క్రింది వారిని కార్యవర్గముగా ఎన్నుకొనిరి.

అధ్యక్షులు: గారపాటి యుగంధర్

కార్యదర్శి: పరకాల పట్టాభి రామారావు

10 మంది వర్కింగు కమిటీ సభ్యుల్ని కూడా ఎన్నుకున్నారు.

ఊరేగింపు: జండా ప్రతిష్ఠాపన

17వ తేదీ ఉదయం కామ్రేడ్ సుందరయ్యను 300 మంది యువకులు ఊరేగింపు వారులతో ఆహ్వానించిరి. అచటినుండి పట్టణం అంతా పూరేగిరి. హిందూయువజన గ్రంథాలయ ఆవరణలో శ్రీమతి మూల్పూరి చుక్కమ్మగారు యువకపతాకాన్ని ఎగురవేస్తూ, యువకులే దేశాభ్యుదయానికి ముఖ్యలను సాంప్రదాయాన్ని నిలబెట్టుడని హెచ్చరించిరి.

తర్వాత హాలులోబహిరంగసభ, గారపాటి యుగంధర్ అధ్యక్షతను జరిగెను. 300 మంది పైగా ప్రజలు హాజరయ్యారు.

మహాసభ

ప్రథమంలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు ప్రతినిధులకు, ప్రేక్షకులకుఆహ్వానం యిచ్చుచూ, రిపోర్టుచదివిరి. తాతినేని సూర్యప్రకాశరావు (కృష్ణాజిల్లా యు. సం. కార్యదర్శి) మహాసభను ప్రారంభిస్తూ, మహాసభ ప్రాముఖ్యతను గురించి చైనా, రష్యా మిత్రమండలి దేశాలలోనియువకుల ఆదర్శమార్గాన్నేఅనుసరించి భారతీయ యువకులు దేశస్వాతంత్ర్యానికి ముందడుగు వేయాలని, ఉపన్యసించారు:

అధ్యక్షులు గారపాటి యుగంధర్ గ్రామాలలోను పట్టణాలలోను, యువకుల బాధ్యతలను గురించి ఉపన్యసించిరి.

సాయంత్రం 4 గం॥ నుండి 300 మంది యువకులతో ఊరేగింపు జరిగింది. తర్వాత పై హాలులో 1000 మందితో సమావేశం (ర్యాలీ) ఏర్పాటు చేయబడినది. ఈ సమావేశంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య (అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్‌కమిటీ సభ్యులు) ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, భారతీయుల కర్తవ్యాలు, యీ యుద్ధంలో మిత్రమండలి గెల్పుటద్వారానే, భారతదేశానికి స్వాతంత్ర్యం ఎలాసిద్ధిస్తుందో, అందులకు కమ్యూనిస్టుపార్టీ యువకులకు, ఏ కార్యక్రమం యిస్తున్నదో, విపులీకరించారు. దేశభక్తుల సహాయంతో, వివిధ ప్రజాసంస్థల సహాయంతో, కమ్యూనిస్టుపార్టీ సాధించిన విజయాలను ఉదహరించారు.

రాత్రి 9½ గం॥ మొదలు 2½ గం॥వరకు కృష్ణా, గుంటూరు, ఏలూరు, వైజ్ఞానిక దళములచే బుర్రకథలు, చిత్ర విచిత్ర వేషాలు, హరికథలు మొ॥ ప్రదర్శింపబడెను. వీటికి 1000 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఇంతటితో జయప్రదంగా మహాసభముగిసెను.

బళ్లారి జైలులో వెంకటరామరాజుగారి అనారోగ్యం

బళ్లారిక్యాంపు జైలునుంచి 19-10-43వ తేదీని విడుదల అయి వచ్చిన దంతులూరి కృష్ణంరాజుగారు యిలా తెలియజేస్తున్నారు:

"క్యాంపు జైలులోఉన్న రాజకీయఖైదీలు అనేకసార్లు మద్రాసు ప్రభుత్వానికి వ్రాసి, ఒత్తిడి తీసుకువచ్చిన ఫలితంగా 15 రోజుల నుంచి జైలు అధికార్లు బియ్యం, కూరగాయలు, వగైరా రేషన్లను ప్రత్యేక వంటశాలలో వండుకొనుటకు అంగీకరించారు. ఇందువల్ల 1300 మంది రాజకీయఖైదీలకు పూర్వం కంటె మంచి ఆహారం లభిస్తోంది. అయితే, వైద్యసహాయం మాత్రం చాలా అసంతృప్తికరంగా ఉంది. రోగులను మెడికల్‌ఆఫీసరు సరిగా పరీక్షచేయడు. చేసినా, సరియైన మందులు యివ్వటలేదు. ఉదాహరణకు, 2 సంవత్సరాల కఠినశిక్ష ననుభవిస్తున్న కామ్రేడ్ గొట్టుముక్కల వెంకట్రామరాజు 157 పౌనుల నుండి 127 పౌనుల బరువుకు తగ్గిపోయి, ఉబ్బసంవల్ల బాధపడుతున్నారు. వారిని ఒక వారంరోజులు మాత్రం జైలు ఆసుపత్రిలో ఉంచి, తరువాత డిశ్చార్జ్ చేశారు. వెంకట్రామరాజుగారి స్థితి ఆందోళన కలిగిస్తోంది. వెంటనే వారిని విడుదలచేయడం గాని, లేదా మద్రాసు జనరల్‌హాస్పిటల్‌కు పంపడం గాని, చేయవలసియుంది.

[దంతులూరి కృష్ణంరాజుగారిది భీమవరం తాలూకాయందలి కోపల్లి గ్రామం, విధ్వంసక చర్యలవల్ల దేశస్వాతంత్ర్యం రాదని గ్రహించినా, ప్రభుత్వోద్యోగుల్ని రాజీనామా ఈయవలసిందని హెచ్చరిస్తూ సత్యాగ్రహం చేయుట సరియైన మార్గమనుకొని, భీమవరం మేజస్ట్రేటుకోర్టులో పికెటింగు చేశారు. ఇందుకు 6 నెలలు కఠినశిక్ష విధించబడింది. బళ్లారిజైలులో వీరు శిక్ష ననుభవిస్తున్న కాలంలో కమ్యూనిస్టులతో సంబంధం కలిగింది. అనేకచర్చలు జరిగిన తరువాత, కమ్యూనిస్టుపార్టీ పాలసీయే సరియైన పాలసీ అని తెలుసుకున్నారు. సం.]

★

అవీ - ఇవీ

అభ్యుదయ రచయితలు ★ షాహుకార్ల సహకారం

ఈ నెల 17 వ తేదీన బందరు పట్టణంలో, స్థానిక అభ్యుదయ రచయితల సంఘ యాజమాన్యమున సారస్వత సభ జరిగింది. సభకు యం. యస్. ఖాదర్‌ఖాన్ గారు ఎం. ఏ. యల్. ఎల్. బి. అధ్యక్షత వహించారు. శ్రీ పాటిబండ మాధవశర్మగారు '20 వ శతాబ్ది తెలుగు సారస్వతం' అను విషయాన్ని గూర్చి ప్రసంగించారు. "కావ్యానికి ఆనందం, సంస్కారం అను రెండు ప్రయోజనాలున్నాయి. కావ్యనిర్మాణరూపాన్ని బట్టి కలిగే ఆనందం పొంగువంటిది, తాత్కాలికం. వస్తువు నాధారంగా కల్గిన సంస్కారం చిరకాలం మిగిలియుంటుంది. అందువలన కావ్యము ఉత్తమ సంస్కారాన్ని కలిగించేదిగా వుండాలి. నన్నయ, తిక్కనాది మహాకవులు తమకాల పరిస్థితుల కనుగుణ్యంగా కావ్యాల రచించారు. అట్లే ఆధునిక కవులు నేటిపరిస్థితులకనుగుణ్యమైన రచనలచేయాలి. క్షీణయుగంలో బయలుదేరిన కొయ్యబొమ్మల వంటి కావ్యాలకు తిరుగుబాటుగా 20 వ శతాబ్ది కావ్య, వస్తువులలోనుమార్పుకై కృషిచేసినవ్యసాహిత్యపరిషత్తువారుఎంతోసాధించారు. కాని తరువాత తాము సాధించిన దానితో తృప్తిపడి పూరుకున్నారు. ఇది చాలదు. వ్యక్తి మానసిక స్థితిని ప్రతిబింబించేదిగాఉన్న నేటి ఆధునిక. కవిత్వం, ప్రజాజీవితాన్ని ప్రతిబింబించేదిగా కావాలిఅని" శర్మగారు ఉపన్యసించారు.

శ్రీ తాపీ మోహనరావుగారు అభ్యుదయ రచయితల సంఘ ఆవశ్యకతనుగూర్చి, కార్యక్రమాన్నిగూర్చి మాట్లాడారు.

"ఆత్మానందంకోసమే రచనలనేవారు ప్రజలకు సంబంధములేని స్వప్నజగత్తులో నివసిస్తున్నవారు- మెరుగులుపెట్టిన గాలిబుడగల తయారుచేసేవారు అని మనం తెలుసుకోవాలి.

నేడు సంఘం తీవ్రగతిని మారుతూంది.

నేడు బ్రహ్మాండమైన ప్రజా వుద్యమాలు నిర్మింపబడుతున్నాయి. యిట్టి ప్రజా జీవితమును చిత్రించి, మన రచనలద్వారా సాంఘికాభివృద్ధికి దారిచూపడమే అభ్యుదయ రచయితల సంఘ ఆశయం. మన రచనలు శవానికి అలంకారం చేసినట్లుకాక జీవితాన్ని సర్వాంగ శోభితంగా చేయునట్లుండాలి" అని మోహన్‌రావుగారు ఉపన్యసించారు. అభివందనాలతో సభముగిసింది.

విశాఖపట్నంతాలూకాలో మందిఅనిఒక గ్రామంవుంది. ఆహారపదార్థాల కరువువల్ల ప్రజలెంత బాధపడుతున్నారో వర్తకులచేత గుర్తింపచేసి, వారు తక్కువ ధరలకు బియ్యం అమ్మేలా చేయాలని ఆగ్రామ యువజన సంఘ బాధ్యులు నిశ్చయించుకున్నారు. సంఘ అధ్యక్షుడు బియ్యపు షాహుకార్లను కలుసుకొని, దేశంలో నేటి కరువుపరిస్థితులను వివరించారు. ప్రజలను ఘోర బాధలనుండి తప్పించాలంటే షాహుకార్లు అధిక లాభాల పేరాశను వదలుకొని, తక్కువ ధరలకు ప్రజలకు అవసర పదార్థాలను అమ్మాలని నచ్చజెప్పారు. ఒకషాహుకారు తప్ప మిగతా వారందరూ ధర తగ్గించి బియ్యం అమ్మడానికి అంగీకరించారు. అదివరకు రూపాయికి 3 శేర్లు అమ్ముతూ ఉండేవారు. అప్పటినుంచి 1-0-6 కు 3¾ శేర్లు అమ్మడం ప్రారంభించారు. ధర తగ్గించడానికి ఇష్టపడని వర్తకుని కొట్టును అందరూ బహిష్కరించే సరికి, అతనూ దిగిరాక తప్పిందికాదు. తమకింత మేలుచేసిన యువజన సంఘాన్ని గ్రామ ప్రజలెంతో మెచ్చుకున్నారు. తమ గ్రామాల్లో కూడా ఇలాంటి సంఘాలుంటే బాగుంటుందని చుట్టుపక్కల గ్రామస్తులు కోరుతున్నారు.

చందాదార్లకు

1. అడ్రసులు స్పష్టంగా వ్రాయాలి.
2. అడ్రసులు మార్చేయెడల, చందా నెంబరు, పాతఅడ్రసు, కొత్తఅడ్రసు వివరంగా వ్రాయాలి.
3. పాతచందాదార్లు చందాలను తిరిగి కట్టేటప్పుడు తమ చందానెంబరు తెలియజేయాలి.
4. తమ చందా అంతమయ్యే తారీఖు తమ పత్రిక అడ్రసుపైననే వుంటుంది. అది చూచుకొని చందా కట్టండి.

పండగలో రాజకీయ విజ్ఞాన ప్రచారం

ఈనాడు మన దేశంలో ప్రజావుద్యమాల దినదినాభివృద్ధి నూతన సంప్రదాయాలను స్థాపిస్తూంది.

ఉదాహరణకు మంగళాపురం (కృష్ణాజిల్లా, దివి తాలూకా) లో మొన్నటి దసరా పండుగ దినాలు రాజకీయ విజ్ఞాన ప్రచారంతో నిండిపోయాయి. వేడుకలతోపాటు, విజ్ఞానాన్ని జతచేసి స్థానిక యువజన, బాలసంఘాలు, కమ్యూనిస్టులు, వందలకొలది ప్రజల మన్ననలను పొందారు.

8 వ తేదీ దసరాపండుగదినం. ఆనాడు బాల, యువజన సంఘ సభ్యులు జాతీయ గీతాలు పాడుతూ, జయజయ ధ్వానాలుచేస్తూ ఊరేగారు. రాత్రి 9½ గంటలనుండి విజ్ఞాన ప్రచారక కార్యక్రమం జరిగింది. కోలాటం, రైతుకూలీ భజన, కష్టజీవి బుర్రకథ, మొదలైనవి ప్రదర్శింపబడ్డాయి. వీటికి సుమారు వేయిమంది ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చారు. కామ్రేడ్ చంద్రరాజేశ్వర్రావు ఈ విజ్ఞాన కార్యక్రమంయొక్క ప్రాముఖ్యాన్ని చక్కగా వివరించారు.

మరునాడు నూకలవారిపాలెంలో ఇంచుమించు ఇదేవిధంగా జరిగింది. కామ్రేడ్ రాజేశ్వర్రావు పంచమాంగదశాన్ని గురించి విపులంగా మాట్లాడారు. ఈ విజ్ఞాన కార్యక్రమాలు కామ్రేడ్ కోగంటి గోపాలకృష్ణయ్య నాయకత్వాన జరిగాయి. ఆరోజు సాయంత్రం ముత్తాసుపాలెంలో వ్యవసాయ కూలీ సంఘంవారు ఎంతో ఉత్సాహంతో ఊరేగింపు జరిపి, ఎర్రజండా ఎగురవేశారు.

ఈవిధమైన కొత్త కార్యక్రమముద్వారా ప్రజల్లో పండగ ఉత్సాహంతోపాటు, రాజకీయ పరిజ్ఞానం వ్యాప్తిచెందడానికి అవకాశం ఉంటుంది. దానివల్ల దినదినాభివృద్ధి పొందుతూన్న ప్రజావుద్యమాలు కొత్త ఉరవడితో అభివృద్ధిపొందగలవు.

★ యుద్ధ సమీక్ష

నీపర్‌లో 50 జర్మను డివిజన్లకు ప్రమాదం

ప్రపంచ దృష్టి అంతా నీపర్ మలుపులో జరిగే బ్రహ్మాండ యుద్ధాలపైన, మాస్కోలో జరుగుతున్న త్రైరాజ్య సమావేశంపైన కేంద్రీకరించబడివుంది.

నీపర్ మలుపులో రెడ్‌ఆర్మీ క్రివాయ్ రాగ్‌ను సమీపించుతోంది. ఇదిచాల ముఖ్య రైల్వే కేంద్రం. నీపరు మలుపులోని జర్మన్లు పారిపోవాలంటే ఈ పట్టణంగుండానేపోవాలి. క్రివాయ్‌రాగ్ పట్టుబడితే, జర్మన్లు పారిపోవడానికి మరొకమార్గమున్నా-అదంత సౌకర్యమైనదికాదు.

క్రివాయ్‌రాగ్‌ను రెడ్‌ఆర్మీ మూడు పంక్తులుగా క్రమ్ముకొంటున్నది. క్రివాయ్‌రాగ్‌కు వాయువ్యంగా 10 మైళ్ళలోను, ఈశాన్యంగా 7 మైళ్ళలోను, ఉత్తరాన 6 మైళ్ళలోను సోవియట్ సైనికపంక్తులున్నాయి.

ఇంతేగాక నీపర్‌పెట్రోవ్‌స్క్‌ను రెండు ప్రక్కల రెడ్‌ఆర్మీ క్రమ్ముకొస్తున్నది. మెలిటోపోల్, 11 రోజుల భీషణయుద్ధం జరిగాక రెడ్‌ఆర్మీ వశమయింది. మెలిటోపోల్ దక్షిణ రంగంలోని జర్మన్లకు కంఠనాళం. క్రైమియాలో చొరబడటానికి కీలకస్థానం. క్రైమియాకు, నీపరు దిగువ భాగాలకు వెళ్ళడానికి ఇపుడు రెడ్‌ఆర్మీకి సులభమయ్యింది.

మెలిటోపోలును వశపరచుకొన్న రెడ్‌ఆర్మీ, ఖెర్సన్ అనే రైల్వేస్టేషను పైపుకు పోతోంది. ఇది నీపరునది నల్ల సముద్రంలో కలిసే చోటుకు సమీపంగావుంది. నీపరు మలుపులోని జర్మన్లు పారిపోకుండా అడ్డు తగలడానికి దీనిని రెడ్‌ఆర్మీ చేజిక్కించుకోవడం అవసరం.

రెడ్‌ఆర్మీ వ్యూహం నెగ్గితే, నీపర్ మలుపులో 50 జర్మను డివిజన్లకుపైగా నాశనమవుతాయి.

కీవ్ యుద్ధం కూడా తుదిఘట్టానికి వస్తున్నది. హిట్లరు కీవ్ పట్టణాన్నంతా నాశనం చేయమని ఆజ్ఞాపించాడంటే, దానిని వదలి పారిపోవాలని చూస్తున్నాడన్నమాట.

సోవియటు సైన్యాల ఈ అఖండవిజయాలవల్ల జర్మను ప్రజల గుండెలలో రాయి పడుతోంది. వారి మనోనిబ్బరం చెడిపోతోంది. ముందు ముందు పెద్ద పెద్ద పరాజయాలకు దిగ్భ్రమచెందకుండా ప్రజలను తయారుచేయడానికి జర్మను నాయకులు రేడియో వుపన్యాసాలద్వారా ప్రయత్నించుచున్నారు.

కాని వారి ఆటలు సాగడంలేదు. ప్రజలలో అపజయ భయమే గాక, తిరుగుబాటు తత్వం కూడా హెచ్చుతోంది. హిట్లరు ప్రభుత్వాన్ని కూలద్రోయాలంటూ జర్మనీలో రహస్యకరపత్రాలు పంచుతున్నారు. విమానదాడివల్ల బాధల పొందినవారి దుర్భర స్థితిని వర్ణించుతూ, హిట్లరును కూలద్రోయండని చెప్పే కరపత్రాలు కూడా పంచిపెట్టబడుతున్నాయి.

ఇటలీ లొంగిపోయినదన్న వార్త రాగానే 10 వేల ఇటాలియను కార్మికులు బెర్లిన్‌లో సమ్మెచేశారు. తమను తమ దేశానికి పంపవలసిందని కోరారు. వారు అంతర్జాతీయ గీతాన్ని పాడారు; హిట్లరు బొమ్మలను తగలపెట్టారు. (ఈవార్తను లండన్ టైమ్సు అగస్టులో ప్రకటించింది.

రెడ్‌ఆర్మీ కొట్టే చావుదెబ్బలకు హిట్లరు ముఠాలో కల్లోలం బయలుదేరింది. ఇందుకు నిదర్శనం గతమూడునెలలలో మిలిటరీ నాయకులతో హిట్లరు సమావేశాలపైన సమావేశాలు, సంప్రదింపులపై సంప్రదింపులు జరపడమే.

వీటికితోడు ఆక్రమిత దేశ ప్రజల తిరుగుబాట్లు రోజురోజుకూ వృద్ధి అవుతున్నాయి. యుగోస్లావియాలో అనేకపట్టణాలలో పరిశ్రమలను నాశనం చేయడం, మిలిటరీ రైలుబండ్లను నాశనంచేయడం, నిత్యకృత్యంఅయిపోయింది. ఆల్బేనియా సరిహద్దులో, క్రోట్ రాష్ట్రంలో, దక్షిణస్లోవేనియాలో, గెరిల్లాల ఉద్యమం తీవ్రమయింది.

ఫ్రాన్సులో సావాయ్ కొండలలోని గెరిల్లాలు జర్మన్లను ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించుతున్నారు. 30 వేల ఫ్రెంచి కార్మికులు (గనులలో పనిచేసేవారు) సమ్మెచేశారు.

ఇలా అన్నివిధాలా చావుదెబ్బలు తింటున్న హిట్లరును పూర్తిగా తుడిచిపెట్టాలంటే మిత్రరాజ్యాలమధ్య సైనికవ్యూహ సమన్వయం ఉండాలి. అంటే రెండవరంగం తెరవాలి.

బ్రిటను అమెరికాలు ఇటలీలో యుద్ధం చేస్తున్నంత మాత్రాన అది రెండోరంగం కాజాలదు. అలా అనుకోడం, (ఈవెనింగ్ స్టాండర్డు పత్రిక ఒకసారి చెప్పినట్లు) చదువు రానివాళ్లు అనుకోవలసినమాట. ఫ్రాన్సు, బెల్జియంలపై దండెత్తి 60 జర్మను డివిజన్లను పని గల్పించితేనే అది రెండవ రంగం అవుతుంది. ఇపుడు ఇటలీలో జరిగే యుద్ధాన్ని విమర్శించుతూ రెడ్‌స్టార్ ఇలా వ్రాసింది: "మిత్రరాజ్యాల ఇటలీ యుద్ధ వ్యూహం, హిట్లరుకోరుతున్న కాలవిలంబనానికి సహాయపడుతోంది. ఇంగ్లీషు ఛానల్ మీదుగా యూరపుపై దండయాత్ర జరగకపోతే, యుద్ధాన్ని చాలాకాలంఈడ్చవచ్చునని జర్మనీ ఉబలాట పడుతోంది."

ఇట్టి సమయంలో మార్షల్ స్మట్సు "రెండవ రంగం వచ్చే సంవత్సరంలోనే" అని అనడం ఆశ్చర్యకరంగావుంది. అభివృద్ధినిరోధకులు ఇతని నోటివెంట పల్కించిన పల్కులు ప్రపంచ ప్రజాక్షేమానికే ముప్పును తెస్తాయి.

దాదాపు 2 నెలల క్రిందట, బ్రిటిషు కమ్యూనిస్టు దినపత్రిక "డైలీవర్కర్" ఇలా వ్రాసింది:

"రెండవ రంగానికి చూపించే నిజమైన అభ్యంతరాలూ, కల్పించిన అభ్యంతరాలూ, అన్నీ తొలగిపోయాయి. ఒకప్పుడు మనకు ఆయుధాలులేవు. ఇప్పుడు వాటికి కొదువలేదు.

ఒకప్పుడు మనకు సైనికులు కావలసినంతమంది లేరు. ఇప్పుడా కొరతలేదు. బ్రిటిషు-అమెరికన్-కెనడియన్ సైన్యాలెన్నో ఉన్నాయి.

ఒకప్పుడు శత్రు విమానబలాన్ని ఎదుర్కోవలసివచ్చేది ఈనాడు మనమే వాళ్ళ నెత్తిన బాంబుల వర్షం కురిపిస్తున్నాం.

ఇదివరకు చాలినంత నౌకాబలంలేదు. ఇప్పుడో, లక్షలకొలది టన్నుల నౌకలున్నాయి.

ఒకప్పుడు మన రాక పోకలను చికాకు పరిచే శత్రు సబ్‌మెరిన్‌లున్నాయి.

కాని ఇప్పుడాప్రమాదాన్ని అతిక్రమించాం.

ఒకప్పుడు హిట్లరు ప్రగల్భాలుకొట్టే "యూరప్‌కోట" రక్షణశ్రేణులంటే భయముండేది.

కాని ఇవి డాబుడాంబరం అంతా సిసిలీ యుద్ధంలో బద్దలయింది."

ఇందుకు కొన్ని ఉదాహరణ లీయవచ్చు: మెడిటరేనియన్ సముద్ర రహదారి ఖాళీ అవడం మూలంగా, ఇపుడు బ్రిటనుకు 20 లక్షల టన్నుల నౌకలు ఖాళీ అయ్యాయి. అక్షరాజ్యాల ఉత్పత్తికంటె మిత్రరాజ్యాల ఉత్పత్తి మూడురెట్లువుంది. సిసిలీ యుద్ధంలో 2 రోజులలో 40 వేల మందిని, 300 టాంకులను, 700 ఫిరంగులను, ఇంకా తదితరఅవసరవస్తువులను, బ్రిటను సిసిలీ తీరంపై దింపగలిగింది. ఇలాగేపశ్చిమ యూరప్‌పై, ఇంత పెద్దఎత్తున అనేకచోట్లను దింపడానికి వీలున్నదనిమిలటరీ నిపుణులఅంచనా, కాబట్టి రెండవరంగం తెరవడానికి నిజమైన అభ్యంతరాలేవీలేవు.

మాస్కో సమావేశంలో ఈ రెండవ రంగం విషయమే ప్రధానంగాచర్చించి, మిత్రరాజ్యాలు వివిధ రంగాలలో యుద్ధాలను సమన్వయ పరచాలంటూ, గతవారం ప్రవదా, ఇజ్వెస్టియా పత్రికలు వ్రాశాయి.

అసలు ఈ సమావేశం జరగడమే, మిత్రరాజ్యాలపక్షంలో ఐక్యతాశక్తులుబలపడుతున్నాయనడానికి నిదర్శనం. కాని దీని అర్థం బ్రిటన్ అమెరికాలలో అభివృద్ధి నిరోధకులు ఓడిపోయారనికాదు. బ్రిటిషు అమెరికా పత్రికలలో సోవియట్ ప్రతికూల ప్రచారం కొందరు లేవదీస్తున్నారు. ఒక అమెరికా విలేఖరి "హిట్లర్ని చావగొట్టడం, మనకంటె ఇంగ్లండు రష్యాలకు లాభం" అంటూ వంచమాంగ దళ ప్రచారం చేస్తున్నాడు. కొందరమెరికా సెనేటు సభ్యులు ప్రపంచ పర్యటనం చేసి వచ్చి సోవియట్ వ్యతిరేక ప్రచారానికి పూనుకొన్నారు. కరుడుగట్టిన సామ్రాజ్యవాద అభిప్రాయాలను వెలిబుచ్చే వాన్‌స్టిటార్ట్ "రష్యాలోని స్వతంత్ర జర్మను కమిటీ" వనికి రాదంటూ దుమ్మెత్తిపోశాడు.

కాని వీరిఆటలు నెగ్గవనీ, మూడురాజ్యాల మంత్రులు సమావేశపరచడానికి ప్రపంచ ప్రజలు తెచ్చిన ఒత్తిడియే, సోవియటు వ్యతిరేక వుద్యమాన్ని నాశనం చేస్తుందని గుర్తించాలి. ఆప్రజల ఒత్తిడియే, బ్రిటను అమెరికాలు రెండవరంగం విషయమై సోవియటుతో తగిన ఒడంబడికకు వచ్చేటట్లు చేస్తుంది.

పైన చెప్పిన అభివృద్ధి నిరోధక ముఠాల ప్రయత్నాలు వృధా అవుతున్నాయి. వారి సామ్రాజ్యవాదపు కలలు కల్ల లవుతున్నాయి. ప్రజావుద్యమాలు అన్నిఆక్రమితదేశాలలోను సోవియటు అండలో పెంపొందుచున్నాయి. ఉదాహరణకు పోలిష్, యుగోస్లావ్ దేశభక్తుల ఉద్యమాలను తీసుకోవచ్చు.

సోవియటు భూమిలో యేర్పడిన పోలిష్ సైన్యాలు నీపర్ యుద్ధాలలో పాల్గొంటున్నాయి. అఖిల స్లావ్ జాతుల సమ్మేళనంలో పోలిషు దేశభక్తులు యిలాప్రకటించారు. "మేం దగ్గర త్రోవను (అంటే సోవియటుమీదుగా) మన మాతృభూమికి వస్తున్నాం." ఇలా వీరు ప్రకటించడంలో ఒకవిశేషముంది. ఇదివరకు సోవియటు సహాయ సంపత్తులతో కొన్ని పోలిష్‌సైన్యాలు సోవియటులో యేర్పడ్డాయి. కాని సోవియటు-పోలిష్ ఒడంబడికకు విరుద్ధంగా, పోలిష్‌అభివృద్ధినిరోధకులు, ఆసైన్యాలను, స్టాలిన్‌గ్రాడ్‌వంటి అతిక్లిష్ట యుద్ధసమయంలోకూడ, ఇరాన్‌కు పంపారు. ఈద్రోహాన్ని సహించలేక కొందరు పోలిష్ సైనికులు ఇరాన్ వెళ్ళ నిరాకరించారు. అట్టి పోలిష్ దేశభక్తులే, నేడు తమ మాతృదేశ విముక్తికోసం సోవియటుతో భుజం భుజం కల్పి పోరాడుతున్నారు.

అఖిల స్లావ్ జాతుల సభలోనే జనరల్ మిహిలోవిచ్ ద్రోహచర్యలను యుగోస్లావియా దేశభక్తులు ఖండించారు.

ఇట్టిస్వాతంత్ర్యోద్యమములను సోవియట్ ప్రభుత్వం సపోర్టు ఇస్తుందంటే, భవిష్యత్తులో సోవియటు ప్రతికూల శక్తులకు తావులేకుండా చేస్తున్నదన్నమాట. యూరప్‌లో ప్రజలు తమ ఇష్టంవచ్చిన ప్రభుత్వాన్ని తామే నిర్మించు కొనడానికి సహాయపడుతున్నదన్నమాట.

25-10-43

—తుమ్మల వెంకటరామయ్య

మన రాజకీయాలు

(8వ పేజీ తరువాయి) పరిష్కరించుటకై లీగ్-కాంగ్రెసులకు చక్కని అవకాశం లభిస్తుంది; సామ్రాజ్యవాదులఅవకతవకలకు స్వస్తిచెప్పవచ్చు; ప్రజల పూర్తిసహకారం పొందవచ్చు, దేశరక్షణకై ప్రజలందరినీ ప్రోత్సాహపరచవచ్చు.

దీనిఅర్థం, సమస్య దానంతట అదే పరిష్కరించ బడుతుందని భావించకూడదు. బ్రిటిష్ ప్రజాభిప్రాయంయొక్క ఒత్తిడి, మన దేశంలోనే ప్రజాశక్తుల ఒత్తిడి సమస్యా పరిష్కారానికి చక్కని అవకాశం యిస్తున్నాయి. ఈ అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలి. క్రిప్సు రాయబారాలకాలంలో వలె ఇప్పుడుకూడా మన ప్రధాన జాతీయ సంస్థలు ఐక్యతను సాధించకపోతే, మన కనుకూలంగా ఏర్పడ్డ పరిస్థితుల్ని కాలదన్నినవారమౌతాము. అనుభవంమీద తెలుసుకున్న గుణపాఠాన్ని యిప్పుడైనా జ్ఞాపకముంచుకొని, లీగ్ - కాంగ్రెసు ఒడంబడికకై కృషి చేయడం అవసరం.

కాని, దేశంలో తాండవమాడే కరువు రాక్షసినుండి ప్రజల్ని కాపాడుటకు సహితం కాంగ్రెసు నాయకులు, ముస్లింలీగ్ నాయకులు, కలిసి పనిచేయడంలేదు. అనేక సందర్భాలలో పోరాడుతున్నారు. నేటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులలో ఐక్యత ఎంత పదునైనఆయుధమో దేశభక్తులు ఇంకాగుర్తించడంలేదు. పరిస్థితులిలాగే ఉంటే, ఎప్పటి మాదిరిగానే అధికారం అంతా సామ్రాజ్యవాదులచేతులలో ఉండిపోతుంది. దేశం చెప్పరాని బాధలకు, పరాభవానికి లోను కావలసి వస్తుంది.

దేశభక్తులకు విన్నపం

కాబట్టి, దేశభక్తులంతా యీవిషయమై తీవ్రంగా ఆలోచించవలసిందని మావిన్నపం. గతసంవత్సరం జరిగినమాదిరి యీ సంవత్సరం కూడా జాతీయైక్యత అనే ఆయుధాన్ని ధరించకుండా, సామ్రాజ్యవాదుల చేతుల్లోనే చొరవను విడిచిపెట్టుతారా? లేక కాంగ్రెసు-లీగ్ఐక్యతను సాధించి సామ్రాజ్యవాదుల చేతుల్లోఉన్న చొరవను లాక్కుంటారా? రెండో మార్గం — కాంగ్రెసు నాయకుల విడుదలకు, జాతీయ ప్రభుత్వ స్థాపనకు, సోపానం అని మీరు గ్రహించాలి. అప్పుడే ప్రజల్ని కరువు బాధనుండి రక్షించగలుగుతాం. అప్పుడే 40 కోట్లమంది భారతీయులు ఉత్సాహంతో దేశరక్షణకై నడుం బిగించుకొంటారు. కాంగ్రెసు ఆశయమైన మిత్రరాజ్యాల విజయం అప్పుడు శీఘ్రంగా లభిస్తుంది. 25-10-43

కామ్రేడ్ కట్టయ్యను పెరోల్‌పై వదలాలి

★

కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు, ఫాసిస్టు వ్యతిరేకి అయిన కామ్రేడ్ మోటూరి కట్టయ్యను 1942 అగస్టు ఘటనలసందర్భంలో ప్రభుత్వం అరెస్టుచేసి డెటిన్యూగా వుంచింది. లోగడ ఒకసారి తల్లికి జబ్బుగావున్నందున పెరోల్ మీద విడుదల చేయమని కోరితే తగినంత ప్రమాదకరంగా జబ్బులేదని ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు అతని తల్లి చావు బ్రతుకులమధ్య వున్నది. తండ్రి పక్షవాతపు దెబ్బతో పడిపోయినాడు. కనుక ప్రభుత్వం వెంటనే కామ్రేడ్ కట్టయ్యను పెరోల్‌మీద విడుదలచేయాలి.

—యం. హనుమంతరావు,
కార్యదర్శి,
గుంటూరుజిల్లా కమ్యూనిస్టు కమిటీ.

"కాంగ్రెసుకు కళంకంతెచ్చే దుష్ప్రచారాన్ని యువకులంతా ఎదుర్కోండి".

4 వ గుంటూరు జిల్లా యువజన మహాసభలో నాయకుల హెచ్చరిక

అక్టోబరు 15వ తేదీ. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సాయంకాలందాకా ళ్ళన్నీ వచ్చి ఆగాయి. స్టేషనంతా కోలాహలంగావుంది. యువక పతాకాలతో, వీరగేయాలు పాడుతూ దళాలు బయలు దేరాయి కొరెటిపాడువైపు. "జిల్లా యువజన మహాసభకుజై" యంటు జేజేలుకొడుతున్నారు. మరోగంటకల్లా బస్సు స్టాండులో దిగాయి మరికొన్ని దళాలు.

మరునాడుదయం కొరిటెపాడంతా కిటకిటలాడుతోంది. జోరున వానకురిసి వెలిసింది. "ప్రభల" పెండాలంతా ప్రజారక్షణ దళంతో క్రిక్కిరిసిపోయింది.

ఊ రే గిం పు

సాయంకాలం 3 గంటలకు వర్షం కురుస్తూన్నా వూరేగింపు బయలుదేరింది. 1200 మంది రెండు బారులుదీరి, అరమైలుపొడవున నడుస్తున్నారు. తడిబట్టలతోనే మిన్నుముట్టే నినాదాలతో వూరేగింపు 4 మైళ్ళు తిరిగింది. పట్టుదల, కార్యదీక్ష యువకుల ముఖాలలో ప్రతిబింబిస్తున్నాయి. దేశాన్ని ఈక్లిష్టపరిస్థితులలో కాపాడగల వీర యువకులున్నారనే విశ్వాసాన్ని రేకెత్తించింది ఊరేగింపు.

ఊరేగింపు ఆరుగంటలకల్లా పార్కుకు చేరుకుంది. మైదానం మధ్యనున్న జండా చుట్టు వలయం చుట్టి నిలబడ్డారు యువకులంతా. సుశిక్షిత సైన్యంలాగా పిడికిళ్ళుబిగించి ఐక్యకంఠంతో "ఎగురవేయ్! భారతభువిపై యువకపతాకం" అనే పాటపాడుతుంటే ప్రేక్షక హృదయాలు ఉప్పొంగిపోయాయి. పిమ్మట పులుపుల శివయ్యగారు యువజన సంఘ జండా నెగురవేసి, శాల్యూట్ చేయించి, జండా ప్రాముఖ్యాన్నిగూర్చి ప్రసంగించారు.

మహాసభ; ప్రారంభోపన్యాసం

తదుపరి, మోటూరి పరంధామయ్యగారి అధ్యక్షతను 3 వేల మంది ప్రేక్షకులతో ప్రారంభమయింది మహాసభ. శ్రీ కాట్రగడ్డ నారాయణరావుగారు ప్రారంభోపన్యాసంలో "1930-31 లో మేము కుర్రవాళ్ళముగావున్న దశలో జాతీయోద్యమప్రదర్శనాలనుచూచాను. కాని నేటి మీవుత్సాహం, కార్యదీక్షను చూస్తే అంతకంటె ఎన్నోరెట్లుగా కనిపిస్తోంది. ఇందుకు నేనెంతో ఉత్తేజితుడనౌతున్నాను.

"ఊరేగింపు పార్కు గేటు ప్రవేశించే చోట కొందరు యువకులు వూరేగింపులోని మహిళలను దుర్భాషలాడించాలని ఒక పిచ్చివానిని రెచ్చగొడుతున్నారు.

"పార్కులో ప్రవేశించేసరికి 4 రు యువకులు నాకొక కరపత్రాన్ని యిచ్చారు. వారి చేతులలో 'ములుకోల' పత్రికలుకూడా వున్నాయి. కరపత్రం చదివి, ఆవేశం పట్టలేకపోయాను.

దుష్ప్రచారానికి చెంపపెట్టు

"కాంగ్రెస్‌వాదిని గనుక కాంగ్రెస్ పేరుతో జాతీయోద్యమానికి విరుద్ధంగా జరిగే దుష్ప్రచారా న్నెదుర్కోనడం నా కర్తవ్యం. కరపత్రంలో కమ్యూనిస్టులు 6 వేలు రాయలసీమ ఫండు తిన్నారని వ్రాసి పంచుతున్నారు. తన చిన్నవయసులోనే విప్లవవీరుడుగా తయారై, 15 సంవత్సరాలనుండి ఎన్నో నిర్బంధాలకు గురియై, తన సర్వస్వాన్ని దేశానికే అర్పించి మా కందరకుకూడ మార్గదర్శకుడుగా ఉండగల సుందరయ్యగారు 6 వేలకు ఆశించి తన పార్టీని మలినపరిచాడంటే, యే జాతీయవాది నమ్మగలడు?

జాతీయోద్యమంలో శ్రీలిలా ముందుకు వస్తుంటే దేశభక్తు లెంతో సంతోషిస్తారు. సత్కరించుతారు. కాని దుర్భాషలాడటం తుచ్ఛుల పని. జాతీయోద్యమంలో తావులేని యీ నీచపుపని కాంగ్రెసు పేరుతో జరుగుతూందనే నాదుగ్ధ. జాతీయ నాయకులను జైళ్ళలో బెట్టిన ప్రభుత్వ చర్యను సమర్ధించినట్టి "ములుకోల" పత్రికను జాతీయత పేరుతోను, దేశభక్తి పేరుతోను పంచుతున్నారంటే, యింతకన్నా దేశద్రోహం మరొకటుండదు.

విషయంలేని పిచ్చివ్రాతలు వ్రాస్తున్న "జమీన్ రైతు" పత్రికను పంచటం దేశభక్తుని కార్యక్రమం కానేరదు. మునిగిపోతూ గడ్డిపరకనుపట్టి ప్రాణం కాపాడుకోచూచే యీ వ్యక్తులా కాంగ్రెస్‌వాదులు? కాంగ్రెసుకు అపకీర్తిని తెచ్చే యిలాంటి చర్యలను హర్షించడం కర్తవ్య విస్మరణ. కాంగ్రెస్‌వాదిగా తోటి కాంగ్రెస్‌వాదులను ప్రశ్నించటానికి నాకు హక్కువుంది. 48 కోట్లు పైనా ప్రజల్ని నానాహింసలు పెట్టే జపాను మనకు స్వాతంత్ర్యము యిస్తుందని చంకలెగురవేయటానికి గాదు మన కాంగ్రెస్ గత 50 సంవత్సరాలుగా యింత త్యాగం చేసింది. కాన యువకులంతా కాంగ్రెసుకు కళంకంతెచ్చే యీ దుష్ప్రచారా న్నెదుర్కొంటూ, దేశా న్నెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి ఐక్యతతో ముందుకు రావాలని హెచ్చరిస్తున్నా" నని చెప్పారు.

విచ్ఛిన్నకుల ఆటలను అరికట్టాలి!

పిమ్మట యం. బసవపున్నయ్యగారు ఉపన్యసిస్తూ. "సంఘంలో సగభాగంగావున్న స్త్రీలుగూడా, జాతీయోద్యమంలో పాల్గొనాలని మన నాయకులన్నారు. గత జాతీయోద్యమంలో చాలమంది స్త్రీలు పాల్గొన్నారు. ఆసాంప్రదాయల్నే మారుమూలల గ్రామాలకు తీసుకుపోయి రైతు, కూలీ, స్త్రీలనుగూడ సంఘటితపరుస్తూంటే సహించలేక నిందలుఅంటగట్టి దుష్ప్రచారంచేస్తున్న నీచులంతా "జాతీయత" అనే తోక తగిలించుకుంటున్నారు. పౌరుషంగల పెద్దలూ, జాతీయ సాంప్రదాయాలకు గర్వించే దేశభక్తులూ, విచ్ఛిన్నకుల ఆటలను అరికట్టాలి."

సుందరయ్యగారి ఉపన్యాసం

పుచ్చలపల్లి సుందయ్యగారు యిలా ఉపన్యసించారు: "యువకులు దేశస్వాతంత్ర్యంకోసం వైజ్ఞానిక కళలలో ప్రావీణ్యత సంపాదించటం కోసం, శారీరక మానసికాభివృద్ధి కోసం సంఘాలలో చేరారు. నేటి మీ క్రమశిక్షణ, త్యాగబుద్ధి గాంధిజీ, నెహ్రూలు బయట వుండినట్లయితే చూచి సంతోషించేవారు. కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యునిగా స్వతంత్రపోరాటంలో ముందుకొచ్చే ప్రతి వుద్యమాన్ని బలపర్చటం మా ఆశయమనీ, మనం సంపాదించే స్వతంత్రం సోవియట్ లోవలె ప్రజలకు సర్వసౌఖ్యాలు గలిగించే ప్రజాతంత్రంగా వుండేటట్లు చేయడం మా కార్యక్రమమనీ చెబుతున్నాను. అభ్యున్నతికి దారితీసే ఏ వుద్యమం బలపడ్డా మా ఆశయం బలపడ్డట్టే. మీరంతా మీసంఘాన్ని బలపర్చుకుంటూ దేశాన్నెదుర్కొన్న దాడి ప్రమాదంనుండి, కరువుబాధల నుండి మన ప్రజలను కాపాడడం కర్తవ్యంగా పెట్టుకుని పనిచేయండి."

అమెరీవాదాలకు వంత

పిమ్మట ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సభ్యులూ, 20 సంవత్సరాల జాతీయోద్యమ జీవితంగల శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఉపన్యసించారు.

"గాంధీజీ అరాచకాన్నిఖండిస్తే, జైలులో వుండి మతిపోయి తోచకచేశాడన్న వారా దేశభక్తులు? అమెరీ అంటగట్టిన నేరాలన్నీ జాతీయసంస్థకు, నాయకులకు అంటగట్టి అమెరీ వాదాలకు వంతపాడటమా దేశభక్తి? ఇంటిప్రక్కన పల్నాడులో జనం చస్తూంటే, తోటి బెంగాలులో నిమిషానికొకరు చస్తుంటే, చూస్తూ కూర్చొని అంతా చచ్చిన తరువాత పట్టాభిషేకం ఎవరికి?

"దేశభక్తి, విజ్ఞానం, దేహదారుఢ్యంగల యువకులుగా మీరు తయారుకండి. చైనా, రష్యా యువకులవలే మాతృదేశ రక్షణకు నడుములు బిగించండి" అని ఉత్సాహాన్ని పురికొల్పుతూ మాటాడారు. రాత్రి 9-30 లకు బహిరంగసభ ముగిసింది.

వ్యాయామ ప్రదర్శనాలు

ఆరోజు రాత్రి టౌన్‌హాలులో 2000 మంది ప్రేక్షకులు క్రిక్కిరిసిపోయారు. కృష్ణాజిల్లా నుండి "వ్యాయామ సింహ" దండమూడి రాజగోపాలరావుగారు, పాండురంగారావుగారు వ్యాయామ, బలప్రదర్శనలు జరిపారు. కర్రసాము, కత్తిసాము ప్రదర్శించారు. తదుపరి కోలాటం, సమిష్టిగానం, పండరి భజన, చెంచీత, అన్నా చెల్లెలు, టాన్యా బుర్రకథ ప్రదర్శించారు.

ప్రతినిధుల సమావేశం

17 వ తేదీ ప్రతినిధుల సమావేశం జరిగింది. 9 తాలూకాల నుండి 150 మంది ప్రతినిధులు, 250 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. శ్రీ మోటూరి పరంధామయ్యగారు అధ్యక్షత వహించారు. గత సంవత్సరం జిల్లా యువజనసంఘాధ్యక్షులు మాదల వీరభద్రరావుగారు వార్షిక నివేదిక యిచ్చిన పిదప తాలూకా కార్యదర్శులు రిపోర్టులు యిచ్చారు. సమావేశంలో యువకులు వ్రాసిన చిత్రాలు, రైతు యువకులు నైపుణ్యంతో చేసిన, నిగమారు, చరణాకోల, వడ్రంగి యువకులు కొయ్యతో చేసిన నక్షత్రపు దిమ్మ, పెన్ వగయిరా ప్రదర్శించబడ్డాయి.

బహిరంగసభ

సాయంకాలం గం 6 లకు కొరిటెపాడులో 2000 మందితో బహిరంగసభ జరిగింది. వివిధ తాలూకాలమధ్య వైజ్ఞానిక పోటీలు జరిగాయి. అన్ని తాలూకాలు పాల్గొన్నాయి. బాలసంఘంవారు కూడా పాల్గొన్నారు. ఈ పోటీల్లోగెలుపొందినవారికి, ఆటలలో గెలుపొందినవారికి బహుమతు లీయబడ్డాయి. కృష్ణాజిల్లా యువకులు శ్రీపాండురంగారావుగారు గుంటూరు ఫ్యాక్టరీ కార్మికసంఘ సభ్యులు శ్రీ బాలాజీదాసుగారు కర్ర, కత్తి సాము ప్రదర్శించారు. అభినందాలతో సభముగిసింది. ఆరాత్రిభోజనానంతరం ప్రతినిధులుసమావేశమై శ్రీ మోటూరి పరంధామయ్యగారిని అధ్యక్షులుగను, వి. సుబ్బారావుగారిని కార్యదర్శిగాను మరికొందరు కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకొన్నారు.

మహాకవి సమ్మేళనంలో బెంగాల్ ★

★ సహాయార్ధం రూ 13,600 ల వసూలు

అక్టోబరు 10వ తేదీన బొంబాయిలో కొవాస్జీ జహంగీరుహాలులో మహాకవి సమ్మేళనం జరిగింది. జోష్‌మలిహాబది, సాగర్ నిజామీ, కాద్రీ మొదలగు ఉర్దూ మహాకవులు ఇందులో పాల్గొన్నారు. హాలు క్రిక్కిరిసి వుంది. బెంగాల్ క్షామనిధికోసం ఈ సమ్మేళనం ఏర్పాటుచేయబడింది.

టిక్కెట్లద్వారా 8500 రూపాయలువసూలు కావడమేగాక, విరాళాలు 5100 వచ్చాయి. పై మహాకవులందరూ తమ టోపీలను భిక్షాపాత్రలుగా ఉపయోగించి తిరుగుతూఉంటే ప్రేక్షకులు తమ జేబులన్నిటినీ ఖాళీచేసి నిధికి ఇవ్వవలసి వచ్చింది.

బెంగాల్ దుస్థితిని గురించి మూడుగీతాలు చదివారు. అందులో ఒకటి శ్రోతల హృదయాలు కరిగేటట్లు బెంగాలు పిల్లల దుస్థితిని వర్ణించే ఒక ఉత్తేజకరమైనగీతం. ఆ గీతం చదవడం పూర్తికాగానే వందల రూపాయలూ, గడియారాలూ, పెన్‌లూవచ్చిపడ్డాయి. వచ్చిన వస్తువులను వేలం వేయడం, ఒక్కొక్కసారి తిరిగి వేలం వేయడం కూడా జరిగింది. చివరిదాకా పోటీచేసి ఓడినవారుకూడా తాము కొనుటకు సంసిద్ధమై ఇవ్వదలచిన మొత్తాలను కూడా ఇచ్చారు. ఒకరు ఒక గడియారాన్ని 1000 రూపాయలకు పాడారు. దానిని అతడు తిరిగి వేలానికిచ్చాడు. ఒక చిన్న పిల్ల ఇచ్చిన రెండణాలను 100 రూపాయలకు పాడారు.

ఈ విధంగా బెంగాల్ క్షామదేవత కళావేత్తలను, కవులను కదిలించింది. ఆంధ్ర కళావేత్తలు కూడా యీ ఉత్తమ పంథాను అనుసరిస్తారా?

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE